PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 77 | విజయవాడ, మంగళవారం 17 అక్టోబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Tuesday 17 October 2023 | Rs

పాలస్తీనా ప్రజల హక్కులు కాపాడాలి

- అంతర్జాతీయ సమాజం ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తీసుకురావాలి
- పాలస్తీనా అంబాసిడర్‌కు ఇండియా ఫోరం సంఘీభావ లేఖ అందజేత

లోపలి పేజీలో..



లంకను కూల్చిన జంపా

- మార్ష్, ఇంగ్లిస్ అర్ధసెంచరీలు
- ఐదు వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా గెలుపు

6



26 వారాల గర్భవిచ్ఛిత్తికి సుప్రీం నిరాకరణ


న్యూఢిల్లీ : తన 26 వారాల గర్భాన్ని వైద్యపరంగా విచ్ఛిత్తి చేయడానికి అనుమతి ఇవ్వాలంటూ ఒక మహిళ చేసిన విజ్ఞప్తిని అంగీకరించడానికి సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. గర్భం దాల్చిన కారణంగా సదరు మహిళ ప్రాణాలకు తక్షణ ప్రమాదం లేదని, గర్భంలోని పిండం ఆరోగ్యంగా ఉందని ఎయిమ్స్ మెడికల్ బోర్డు ఇచ్చిన నివేదిక ఆధారంగా సుప్రీంకోర్టు ఈ తుది నిర్ణయానికి వచ్చింది. ప్రసవానికి అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వమే తగిన సమయంలో చెల్లిస్తుందని కోర్టు తెలిపింది. తల్లిదండ్రులు కోరుకుంటే పుట్టే బిడ్డను దత్తత ఇచ్చేందుకు అవకాశం కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది.


మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటిపి) చట్ట ప్రకారం వివాహిత స్త్రీలు, ప్రత్యేక కేటగిరి కిందకు వచ్చే అత్యాచార బాధితులు, వికలాంగులు, మైనర్లు, అనారోగ్యం, శారీరక బలహీన మహిళలు తమ గర్భాన్ని విచ్ఛిత్తి చేసుకోవడానికి గరిష్ట కాల వ్యవధి 24 వారాలుగా ఉంది. ప్రస్తుత కేసులో 26 వారాలకు పైగా వయసు ఉన్న పిండాన్ని తొలగించడానికి మహిళను అనుమతించాలా వద్దా అనే విషయంలో సుప్రీంకోర్టు గందరగోళానికి గురయింది. ముందుగా ఈ పిటీషన్ విచారించి ఎయిమ్స్ వైద్యులు ఈ నెల 6న ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ నెల 9న గర్భవిచ్ఛిత్తికి సుప్రీంకోర్టు అనుమతించింది. ఈ నెల 10న ఎయిమ్స్ వైద్యుల్లో ఒకరు పిండం బతికే అవకాశం ఉందని సుప్రీంకోర్టుకు ఈమెయిల్ చేశారు. గర్భవిచ్ఛిత్తికి వ్యతిరేకంగా కేంద్రం కూడా పిటీషన్ వేసింది. దీనిపై ద్విసభ్య ధర్మాసనం భిన్నాభిప్రాయంతో తీర్పు ఇచ్చింది. తుది తీర్పు కోసం ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ ధర్మాసనం ముందుకు ఈ పిటీషన్ వచ్చింది. గర్భవిచ్ఛితికి అనుమతి నిరాకరిస్తూ సుప్రీంకోర్టు సోమవారం తుది తీర్పు ఇచ్చింది.

వేతన దోపిడి

- తగ్గుతున్న మహిళా భాగస్వామ్యం
- మరో మార్గం లేక స్వయం ఉపాధి పనులు
- అదే ఘనంగా చెప్పుకుంటున్న కేంద్రం

న్యూఢిల్లీ : ఎప్పుడు అమలులోకి వస్తాయో తెలియని రిజర్వేషన్లను చట్టసభల్లో కల్పించడం ద్వారా మహిళా లోకాన్ని ఉద్ధరించేసినట్లు మోడీ సర్కారు ఒకవైపు ప్రచారం చేసుకుంటుండగా, మరోవైపు పూటగడవడం కూడా కష్టంగా మారుతున్న దుస్థితి క్షేత్రస్థాయిలో మహిళలకు నెలకొంటోంది. పొట్టగడవడం కోసం చేసే రోజువారి కూలి పనుల్లో మహిళల వాటా గణనీయంగా తగ్గుతోంది. గత నాలుగు సంవత్సరాలుగా ఇదే పరిస్థితి నెలకొంది. నేషనల్ స్టాటిస్టిక్స్ ఆఫీసు (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన తాజా పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పిఎల్ఎఫ్ఎస్) ఆధారంగా 'బిజినెస్ స్టాండర్డ్' ఈ విశ్లేషణ చేసింది. కరోనా రక్కసి విజృంభణకు ముందు 2018-19 సంవత్సరంలో సాధారణ వేతన పనిలో మహిళల వాటా 21.9 శాతం ఉండగా, ఆ తరువాత నుండి క్రమేణా తగ్గుతూ 2022-23 సంవత్సరానికి 15.9 శాతానికి పడిపోయింది. శ్రమశక్తిలో మహిళల వాటా తగ్గడానికి అనేక కారణాలున్నట్లు వివిధ సంస్థలు చేసిన అధ్యయనాల్లో తేలింది. వేతనాల్లో వివక్ష చూపించడం. పనిప్రదేశాల్లో కనీస భద్రత లేకపోవడం, కరోనా అనంతర పరిస్థితుల్లో ఇంటి పని ఎక్కువ కావడం వంటివి వీటిలో ఉన్నాయి. ఇలా వివిధ కారణాలతో రోజువారి కూలీకి వెళ్లలేని మహిళలు ఇళ్లవద్దే సొంతంగా ఏదో ఒక పని చేసుకుంటున్నారు. ఫలితంగా స్వయంగా ఉపాధి రంగంలో మహిళల వాటా పెరుగుతోంది. కరోనాకు ముందు స్వయం ఉపాధి రంగంలో మహిళల వాటా 53.4శాతంగా ఉండగా, 2022-23 నాటికి 65.3 శాతానికి పెరిగింది. ఇళ్ల వద్ద రోజంతా రెక్కలు ముక్కలు చేసుకుంటున్నా వీరిలో అత్యధికులకు రోజువారీ కూలి కూడా దక్కడం లేదు. నామమాత్రపు మొత్తాలతో సరిపెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. దీనిని కూడా తమ ఘనతగా చెప్పుకోవడానికి మోడీ ప్రభుత్వం సిద్ధపడుతోంది. స్వయం ఉపాధి రంగంలో మహిళలు పెద్దఎత్తున ముందుకు వస్తున్నారని, అందువల్లే వేతన కూలీల్లో వారి సంఖ్య తగ్గుతోందని కేంద్రం చెబుతోంది. కొద్ది రోజుల క్రితం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సైతం 'కొన్ని సంవత్సరాలుగా మహిళా సాధికారత కోసం తాము చేపట్టిన పథకాలు గణనీయమైన ఫలితాలు సాధించాయి' అని ఆయన అన్నారు.





వాస్తవం ఏమిటి?

2018-19లో 53 శాతంగా ఉన్న స్వయం ఉపాధి రంగం ఆ తరువాత క్రమేణా పెరిగింది. 2020-21 సంవత్సరంలో 55.6శాతంగానూ, 2021-22లో 55.8శాతంగానూ, 2022-23 కు 57.3శాతానికి స్వయం ఉపాధి రంగం చేరింది. వీరిలో అత్యధికులు మహిళలన్న విషయం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇలా స్వయం ఉపాధి పొందుతున్న మహిళల్లో పలువురికి సాధారణ వేతన మొత్తం కూడా దక్కడం లేదు. అయినా, భవిష్యత్తుపై గంపెడాశతో రెక్కలు ముక్కలు చేసుకుంటున్న వారి సంఖ్య గణనీయంగానే ఉంది. 2020-21లో 17.3శాతంగా ఉన్న వీరి సంఖ్య 2022-23 నాటికి 18.3శాతానికి పెరిగింది. 'ఇంటి వద్ద నుండే చిన్నా చితక పనిచేస్తూ స్వయం ఉపాధి పొందాలని ఆశించే వారికి ఏమీ దక్కడం లేదు. ఆర్థిక వ్యవస్థలో వీరి సంఖ్య పెరుగుతుండటం ఆందోళనకర పరిణామం' అని నిపుణులు అంటున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బివి రాఘవులు, చిత్రంలో వి శ్రీనివాసరావు, వై వెంకటేశ్వరరావు

కరువు మండలాలను వెంటనే ప్రకటించాలి
యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కరువు మండలాలను వెంటనే ప్రకటించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు అధ్యక్షతన సోమవారం విజయవాడలో జరిగిన కమిటీ సమావేశానికి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు హాజరయ్యారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ తదితరులు పాల్గొన్నారు. పలు అంశాలపై చర్చించిన అనంతరం కరువుపై తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది.

రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో సకాలంలో సరైన వర్షాలు పడక 300 మండలాలకు పైగా కరువు పరిస్థితులు ఉన్నాయని, పైకి పచ్చగా కనిపించినా సకాలంలో సరిపోయినంత వర్షపాతం లేనందున 30 లక్షల ఎకరాలకు పైగా పంటలు వేయలేదని పేర్కొంది. వేసిన పంటలు కూడా వర్షాలు లేక గిడసబారిపోవడమో, మాడిపోవడమో జరిగిందని, కర్నూలు జిల్లాలో పత్తి, అనంతపురం జిల్లాలో వేరుశనగ దెబ్బతిన్నాయని తీర్మానంలో పేర్కొన్నారు. కొన్నిచోట్ల మొక్కజొన్న రెండోసారి వేయాల్సి వచ్చిందని, తాగునీటికి కటకట ఏర్పడిందనీ పేర్కొంది. కృష్ణా డెల్టాలో నీరందక పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని, విద్యుత్ కోతతో బోర్లకింద పంటలు ఎండిపోతున్నాయని తెలిపింది. ఉత్తరాంధ్రలో వారం రోజులు వర్షాలు పడకపోతే తీవ్ర వర్షాభావ పరిస్థితులు వస్తాయని, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు మెట్ట ప్రాంతాల్లో వర్షాలు, ప్రాజెక్టుల్లో నీళ్లులేవని, వెంటనే కరువు మండలాలు ప్రకటించి ఎదుర్కోవడానికి తగిన ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. కరువు పనులను అదనంగా ప్రకటించాలని, ఆయా ప్రాంతాల్లో ఇ-క్రాప్ బుకింగ్ వెంటనే చేయాలని, ఉపాధిహామీ పనులను మరో వందరోజులు పెంచాలని తీర్మానంలో పేర్కొన్నారు. టెక్నికల్ సమస్యలున్నవనే పేరుతో పంటల నమోదు ఇ-క్రాపింగ్‌లు సరిగ్గా జరగడం లేదని, ఇంతవరకు కరువు ప్రాంతాల్లో 20 శాతం మాత్రమే నమోదు అయిందని తీర్మానంలో తెలిపారు. రైతులకు రావాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా వంటి ఇతర బెనిఫిట్స్ ఇ-క్రాపింగ్ నమోదు చేయకపోతే రావని, ఈ కరువు పరిస్థితుల్లో ప్రభుత్వం శ్రద్ధతో ఇ-క్రాపింగ్ చేయాలని సిపిఎం కోరింది. ఆలస్యం చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కరువు పరిస్థితులను సమీక్షించి, కరువు మండలాలను వెంటనే ప్రకటించాలని, వ్యవసాయ పంట రుణాలను రీషెడ్యూలు చేసి వడ్డీలు రద్దు చేయాలని, యుద్ధప్రాతిపదికపై కరువు నివారణ చర్యలు చేపట్టాలని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది. కేంద్ర ప్రభుత్వం కరువు పరిశీలనా బృందాలను పంపి సహాయం ప్రకటించాలని డిమాండ్ చేసింది.

డిసెంబరులోగా విశాఖకు

- ఇన్ఫోసిస్‌ను ప్రారంభిస్తూ సిఎం జగన్
- ఒక్క ఫోన్ కాల్ దూరంలో ఉంటానని ఐటి కంపెనీలకు భరోసా


ఇన్ఫోసిస్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఎం జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో, అనకాపల్లి ప్రతినిధి

'ఈ ఏడాది డిసెంబరులోగా విశాఖకు షిఫ్టు అవుతాం. నా నివాసం కూడా ఇక్కడే. మా అధికారులు వారి కార్యాలయాలు, ఇతర అంశాలకు సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు' అని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. విశాఖపట్నం ఐటి హిల్స్‌లో నిర్మితమైన ఇన్ఫోసిస్ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ హైదరాబాద్, బెంగళూరు, చెన్నయ్ తరహాలో ఐటి రంగంలో విశాఖకు అన్ని అర్హతలూ, సామర్థ్యం ఉందన్నారు. రాష్ట్ర విభజన తర్వాత గత ప్రభుత్వం ఐటి సేవలకు ప్రాధాన్యత ఇవ్వలేదని విమర్శించారు. గతంలో అన్ని ఐటి సంస్థలనూ హైదరాబాద్‌లోనే ఏర్పాటు చేశారన్నారు. విశాఖలో ఇప్పటికే ప్రతిష్టాత్మక సంస్థలు ఉన్నాయన్నారు. 14 ఇంజనీరింగ్ కాలేజీలు, ఎనిమిది యూనివర్సిటీలు, నాలుగు మెడికల్, 12 డిగ్రీ కాలేజీలతో ఎడ్యుకేషన్ హబ్‌గా విశాఖ ఉందని పేర్కొన్నారు. ఏటా ఇక్కడి నుంచి 12 వేల నుంచి 15 వేల మంది ఇంజనీర్లు బయటకొస్తున్నారన్నారు. ఐఐఎం, నేషనల్ లా యూనివర్సిటీ వంటి సంస్థలూ, ఐఒసి ఇక్కడే ఉన్నాయని వివరించారు. సుమారు 20 వేల నేవల్ అధికారుల కుటుంబాలతో ఈస్టర్న్ నేవల్ కమాండ్ (ఇఎన్‌సి), ప్రభుత్వ రంగ సంస్థలూ ఉన్నాయన్నారు. ప్రతిష్టాత్మక వైజాగ్ పోర్టు, గంగవరం పోర్టు ఇక్కడే ఉన్నాయని పేర్కొన్నారు. కొత్తగా శ్రీకాకుళం జిల్లాలో పోర్టు రాబోతుందన్నారు. రెండేళ్లలో అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

మరిన్ని ఐటి కంపెనీలు విశాఖకు...

టయర్ వన్ నగరంగా ఎదగడం ఐటి కంపెనీలతోనే సాధ్యమని, ఇన్ఫోసిస్ ఇప్పుడు వచ్చిందని, మరిన్ని కంపెనీలు విశాఖ ఐటి జాబితాలో చేరనున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. వెయ్యి మందితో ఇక్కడ ఇన్ఫోసిస్ ప్రారంభమైందని, రాబోయే రోజుల్లో ఇది మరింత విస్తరించనుందని తెలిపారు. రెండేళ్లలో అదానీ డేటా సెంటర్ కూడా అందుబాటులోకి రానుందని, క్లౌడ్ కంప్యూటరింగ్‌తోపాటు ఇంటర్నెట్ కేబుల్ మనకు సింగపూర్ నుంచి ప్రత్యేకంగా వస్తుందన్నారు. ఐటి సంస్థల ప్రతినిధులవైపు చూస్తూ... 'మీకు మరోసారి హామీ ఇస్తున్నా ఏ అవసరం ఉన్నా... మేం కేవలం ఒక్క ఫోన్ కాల్ దూరంలోనే ఉంటాం. మీ అవసరాలకు అండగా నిలబడతాం' అంటూ సిఎం భరోసా ఇచ్చారు. రాష్ట్ర మిగతా 2లో

ఉద్యోగుల వసతి ఎలా ?

విశాఖలో ప్రత్యేక కమిటీ సమావేశం

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఉత్తరాంధ్ర అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి, ఉన్నతాధికారుల పర్యటనల సందర్భంగా ట్రాన్సిట్ అకామడేషన్ కోసం ఏర్పాటైన కమిటీ విశాఖపట్నంలోని విఎంఆర్‌డిఎ కార్యాలయంలో సోమవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి అధ్యక్షతన సమావేశమైంది. త్వరితగతిన పనులు జరిగేలా పర్యవేక్షణ చేసేందుకు ఈ కమిటీ వచ్చింది. వివిధ శాఖలకు సంబంధించిన కార్యాలయాలలో వసతి సౌకర్యాలు, సంబంధిత అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. సిఎం క్యాంప్ ఆఫీసుగా చెప్తున్న రుషికొండను ఈ కమిటీ సందర్శించింది. ఈ కమిటీలో స్పెషల్ సిఎస్ ఫైనాన్స్ ఎస్-ఎస్.రావత్, సెక్రటరీ (జిఎడి) పోలా భాస్కర్ సభ్యులుగా ఉన్నారు. ఈ సమావేశంలో విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ సాయికాంత్‌వర్మ, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు. డిసెంబర్ 21న విశాఖలోనే సిఎం జగన్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించుకోనున్నారని సమాచారం.

పశ్చిమాసియా సంక్షోభంపై సర్వత్రా ఆందోళన

- యురోపియన్ నేతల అత్యవసర భేటీ
- చైనా, రష్యా విదేశాంగ మంత్రుల భేటీ
- టర్కీ, ఇరాన్ నేతల ఫోన్ చర్చలు
- ఇజ్రాయిల్‌లో బైడెన్ పర్యటన?


ఇజ్రాయిల్ బాంబు దాడులను నిరసిస్తూ గాజా వద్ద ఆందోళన చేస్తున్న పాలస్తీనా వాసులు

జెరూసలేం, గాజా : గాజాలో మానవతా సంక్షోభం పెచ్చరిల్లకుండా ఇజ్రాయిల్ దూకుడు వైఖరికి కళ్లెం వేసేందుకు ప్రయత్నాలు ఊపందుకున్నాయి. ఇజ్రాయిల్, హమాస్ మధ్య జరుగుతున్న ఈ యుద్ధం యూరప్‌లో మతాల మధ్య ఉద్రిక్తతలకు ఆజ్యం పోయగలదని ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో యురోపియన్ నేతలు అత్యవసరంగా మంగళవారం సమావేశం కానున్నారు. శరణార్థులను మరింతమందిని అనుమతించే విషయమై చర్చించనున్నారు. "ఈ యుద్ధం అనేక పర్యవసానాలకు దారితీయనుంది.' అని ఇయు కౌన్సిల్ అధ్యక్షుడు చార్లెస్ మైఖేల్ వ్యాఖ్యానించారు. 'అగ్నికి ఆజ్యం పోయవద్దని' ఇరాన్‌ను జర్మనీ హెచ్చరించింది. ఇరాన్ విదేశాంగ మంత్రి హమస్ ఉన్నతాధికారులను కలుసుకున్న నేపథ్యంలో జర్మనీ హెచ్చరిక వెలువడింది. ఈ తరుణంలో పరిస్థితులను మరింత ఉద్రిక్తపరిచేలా ఏ ఒక్క చిన్న చర్యకు పాల్పడినా అది అంతిమంగా ప్రాంతీయ ఘర్షణలకు దారి తీయగలదని హెచ్చరించింది.

చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి తో రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లావ్‌రోవ్ భేటీ అయ్యారు. మధ్య ప్రాచ్యంలో నెలకొన్న సంక్షోభంపై వారు సుదీర్ఘంగా చర్చించారు. దీంతోపాటు పలు ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలు కూడా వారి మధ్య చర్చకు వచ్చాయి. ఉక్రెయిన్ ఘర్షణ గురించి వాంగ్‌తో చర్చించినట్లు లావ్‌రోవ్ తెలిపారు. రాజకీయ, దౌత్య పద్ధతుల ద్వారా దీన్ని పరిష్కరించే ప్రయత్నాలు గురించి కూడా చర్చించామని రష్యా విదేశాంగ శాఖ తెలిపింది. ఈ ఘర్షణలను ఆపేందుకు తీసుకోవాల్సిన చర్యల మిగతా 5లో

ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి ఎన్నికల బాండ్ల కేసు

న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్ల పథకం చెల్లుబాటును సవాలు చేస్తున్న పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించారు. ఈ కేసును ప్రస్తుత త్రిసభ్య ధర్మాసనం నుండి ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించాలని విజ్ఞప్తి తమకు అందిందని, ఈ కేసుకు గల ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని వెంటనే బదిలీ చేయనున్నట్లు చంద్రచూడ్ తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 10న ఈ కేసు విచారణ జరగాల్సి ఉండగా, ఈ నెల 31కి వాయిదా వేశారు. ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు కోసం విచారణ జాప్యం చేసేందుకు కోర్టు తిరస్కరించింది. ఎనిమిదేళ్ల నుంచి ఈ కేసు సుప్రీం కోర్టులో పెండింగ్‌లో వుంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లోగానే ఈ ఎన్నికల బాండ్ల కేసును పరిష్కరించాలంటూ పిటిషనర్ ఎన్‌జిఓ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోర్టును కోరారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో విద్య ముఖ్యం

- పాఠశాల విద్య కమిషనరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో నాణ్యమైన విద్య ముఖ్యమైన అంశమని పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఎస్ సురేష్‌కుమార్ అన్నారు. దీనికోసం డిఇఒలు, ఎంఇఒలు, ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని కోరారు. విద్యాసాధన సర్వే-2023 రాష్ట్రస్థాయి మాస్టర్‌ట్రైనర్స్ శిక్షణ కార్యక్రమం సోమవారం విజయవాడలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమిషనరు హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వే ద్వారా విద్యారంగ పరిస్థితులను అంచనా వేస్తామన్నారు. అందుకు అనుగుణంగా విద్యా పథకాలను ప్రవేశపెడతారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాల ప్రయోజనం, నాణ్యమైన విద్య విద్యార్థులకు అందితేనే సఫలమవుతుందని అన్నారు. 3, 6, 9 తరగతుల విద్యార్థుల అభ్యసన ఫలితాలను అంచనా వేయడానికి ఈ సర్వే నిర్వహిస్తున్నామని, దీనిని సమర్ధవంతంగా నిర్వహించి విజయవంతం చేయాలని తెలిపారు. గ్రాడ్యుయేట్ స్థాయి విద్యార్థుల సారథ్యంలో ఈ సర్వే నిర్వహిస్తామన్నారు. ఇందులో ప్రాథమిక అక్షరాస్యత కూడా పరీక్షిస్తారని, విద్యార్థుల పరిజ్ఞానంతోపాటు వారి అభిప్రాయాలు, ఉపాధ్యాయుల అభిప్రాయాలు సేకరిస్తామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 27 వేలకు పైగా పాఠశాలల్లో ఏడు లక్షల మంది విద్యార్థులను ఈ సర్వే ద్వారా పరీక్షిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ బి ప్రతాప్ రెడ్డి, సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి బి విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ, ఇతరులకు 41ఎ నోటీసు ఇస్తాం

- హైకోర్టుకు సిఐడి హామీ

ప్రజాశక్తి-అమరావతి

ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్పు చేసి అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి నారాయణ, ఇతరులకు సిఆర్‌పిసిలోని 41ఎ నోటీసులు జారీ చేస్తామని హైకోర్టుకు సిఐడి హామీ ఇచ్చింది. నారాయణతోపాటు ఆయన భార్య రమాదేవి, బావమరిది రాపూరు సాంబశివరావు, నారాయణ బినామీ పొత్తూరు ప్రమీలకు 41(ఏ) నిబంధనలకు అనుగుణంగా చేస్తామని చెప్పింది. న్యాయవాది సమక్షంలోనే విచారణ చేస్తామని సిఐడి తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్ దుష్యంత్‌రెడ్డి సోమవారం చెప్పారు. ఈ వివరాలను జస్టిస్ కె సురేష్‌రెడ్డి నమోదు చేసుకుని ఆ కేసుల్లో తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ వారు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను మూసేస్తున్నట్లు ప్రకటించారు.

అమరావతి అసైన్డ్ భూముల కేసు రీఓపెన్

- కీలక ఆధారాలు లభ్యం
- హైకోర్టుకు తెలిపిన సిఐడి

ప్రజాశక్తి-అమరావతి

రాజధాని అసైన్డ్ భూముల స్కాంలో కీలక సమాచారం లభ్యమైందని సిఐడి హైకోర్టుకు తెలిపింది. ఆడియో క్లిప్స్‌ను కూడా అందజేస్తామని చెప్పింది. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకోవాలని సిఐడి తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్ దుష్యంత్‌రెడ్డి హైకోర్టును కోరారు. ఆ వివరాలన్నీ కోర్టుకు నివేదించామన్నారు. వీడియో క్లిప్పింగ్స్ మంగళవారం అందజేస్తామన్నారు. సిఐడి పెట్టిన కేసును కొట్టేయాలని కోరుతూ మాజీ సిఎం నారా చంద్రబాబు నాయుడు, మాజీ మంత్రి పి నారాయణ దాఖలు చేసిన పిటిషన్లపై తిరిగి విచారణ చేయాలని కోరారు. ఈ కేసుల్లో హైకోర్టు వాదనలు ముగించి గత ఆగస్టు 30న తీర్పును వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో కీలక ఆధారాలు ఉన్నాయని సిఐడి హైకోర్టుకు తెలియజేసింది. కేసు రీఓపెన్‌కు అభ్యంతరాలుంటే ప్రతివాదులు కౌంటర్ వేయాలని హైకోర్టు ఆదేశించింది. సిఐడి వేసిన అనుబంధ పిటిషన్లను అనుమతించరాదని, రీఓపెన్ చేయరాదని చంద్రబాబు, నారాయణ తరపున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ అన్నారు. మరో కేసులో లభించిన ఆధారాలను ఈ కేసుతో ముడిపెడుతున్నారని, దీనిపై తమ అభ్యంతరాలను రాతపూర్వకంగా తెలియజేస్తామని చెప్పారు. ఇందుకు కొంత గడువు కావాలని కోరారు. ఇందుకు జస్టిస్ వి రాధాకృష్ణ అనుమతినిస్తూ విచారణను నవంబరు 13కు వాయిదా వేశారు. దర్యాప్తుపై స్టే విధించిన తర్వాత సేకరించిన ఆధారాలా లేక అంతకు ముందే సేకరించినవా అని సిఐడి తరపున న్యాయవాది పేర్కొన్నారు.

ఒపిఎస్ అమలుకై నిరవధిక దీక్షలు

- రేపటి నుంచి ప్రారంభం
- జిపిఎస్ గ్యారంటీ లేదు : యుటిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాతపెన్షన్ విధానం (ఒపిఎస్) అమలు చేయాలని కోరుతూ ఈ నెల 18 నుంచి నిరవధిక దీక్షలు చేపట్టనున్నట్లు యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ వెల్లడించారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్) ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ, 2004 సెప్టెంబరు ఒకటి కంటే ముందు నియామక ప్రక్రియ పూర్తయిన 11 వేల మందికి తక్షణమే ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు జిపిఎస్ పేరుతో ఉద్యోగులను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒపిఎస్ అమలు చేయాలని కోరుతూ నిరవధిక దీక్షలను ప్రారంభిస్తున్నామని చెప్పారు. బుధవారం రాష్ట్ర కేంద్రంలో, గురువారం జిల్లా కేంద్రాల్లో, శుక్రవారం తాలూకా, డివిజన్ కేంద్రాల్లో ప్రారంభమవుతాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్యారంటీ పెన్షన్ స్కీం (జిపిఎస్) విధానంలో 50 శాతం పెన్షన్ ఇస్తామని ప్రకటించినప్పటికీ, ఇందుకు సంబంధించిన చట్టం సమగ్రంగా లేదన్నారు. 33 ఏళ్ల సర్వీస్ పూర్తిచేసిన వారికే పెన్షన్ లభిస్తుందని, మిగిలినవారికి అవకాశం లేదని చెప్పారు. కాంట్రిబ్యూషన్ చెల్లించిన మేరకే పెన్షన్ లభిస్తుంది తప్ప ప్రభుత్వం ఉచితంగా ఇచ్చేది లేదన్నారు. గ్రాట్యూటీ, కమ్యుటేషన్, అడిషనల్ క్వాంటమ్ పెన్షన్ వంటి రాయితీల గురించి చట్టంలో లేవని చెప్పారు. పే రివిజన్ సందర్భాల్లో



నిరవధిక దీక్షల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

పెన్షన్ పెరిగే అవకాశం లేదని వివరించారు. ఇది సిపిఎస్‌కు మరో ప్రతిరూపం తప్ప దీనివల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎటువంటి ఉపయోగం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ చెల్లింపులపై చెబుతున్న లెక్కలు ప్రజలను తప్పుదారి పట్టించేవిగా ఉన్నాయని విమర్శించారు. రాష్ట్రంలో 11 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తుంటే కేవలం రెగ్యులర్ ప్రాతిపదికన నియమించిన ఐదు లక్షల మందికి మాత్రమే పెన్షన్ అమలవుతుందన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పెన్షన్ చెల్లించడం లేదన్నారు. ఈ ప్రభుత్వం నియమించిన ఉద్యోగుల్లో ఆర్‌టిసి, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు మాత్రమే ఉన్నారని తెలిపారు. మిగిలిన వారంతా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులేనని చెప్పారు. మూడేళ్లుగా కొత్త నియామకం లేదని, అలాంటప్పుడు రాష్ట్ర ప్రభుత్వంపై కొత్తగా పడే భారమేమిటో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన జిపిఎస్ ఎటువంటి గ్యారంటీ లేని పెన్షన్ విధానమని చెప్పారు. పదేపదే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కోరినా ప్రభుత్వం మొండిగా అమలు చేయడానికే పూనుకోవడం విచారకరమని పేర్కొన్నారు. ఎటువంటి కాంట్రిబ్యూషన్ లేని ఒపిఎస్ విధానమే ఉద్యోగులందరికీ శ్రేయస్కరమని, సిపిఎస్, జిపిఎస్ విధానాలను రద్దు చేసి దీనిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం 2004 సెప్టెంబరు కంటే ముందే నియామక ప్రక్రియ పూర్తయిన 11 వేల మందికి తక్షణమే ఒపిఎస్ అమలు చేయాలని కోరుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఈ నెల 9న నోటీసు ఇచ్చినా ఇప్పటి వరకు స్పందించలేదన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 18 నుంచి దశలవారీ అన్ని స్థాయిల్లో నిరవధిక నిరసన దీక్షలు చేపడుతున్నామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చేవరకు కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ సహాధ్యక్షులు ఎఎన్ కుసుమకుమారి, కార్యదర్శి ఎస్‌పి మనోహర్ కుమార్, ప్రచురణల కమిటీ ఛైర్మన్ ఎం హనుమంతరావు, సభ్యులు ఎ గోపాలకృష్ణ, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె శ్రీనివాసరావు, ఎ సుందరయ్య పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి

- 2047 ఎపి స్ట్రాటజీ కమిటీ సమావేశంలో సిఎస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2047 నాటికి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, దీనికి అనుగుణంగా అన్ని రకాల చర్యలూ తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి తెలిపారు. 2047 రాష్ట్ర స్ట్రాటజీ ప్లానుపై సిఎస్ అధ్యక్షతన సోమవారం వెలగపూడి సచివాలయంలో సమీక్షా సమావేశం జరిగింది. స్ట్రాటజిక్ ప్లాను అమలుపై నీతి ఆయోగ్ ప్రతినిధి బృందం అధికారులకు ప్రెజెంటేషన్ ఇచ్చింది. ఈ సందర్భంగా జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎపి అభివృద్ధికి సంబంధించి నీతి ఆయోగ్ బృందం ముసాయిదాను తయారు చేసిందని తెలిపారు. దాని అమలుకు నిధులు సమకూర్చుకోవడమే పెద్ద సవాల్ అని అన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం తగిన సాయం అందించగలిగితే ఎపిని 2047 నాటికి అన్ని రంగాల్లో మెరుగైన రీతిలో అభివృద్ధి పథంలోకి తీసుకురావచ్చని తెలిపారు. దీనిపై ఈ నెల మూడోవారంలో సెక్టార్ల వారీ రాష్ట్ర స్థాయిలో వర్కుషాపు నిర్వహిస్తామని తెలిపారు. సమాజంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి ఆయుష్మాన్ భారత్ కింద కల్పిస్తున్న విధంగానే ఎగువన ఉన్న వారికి ఒక బీమా సదుపాయం కల్పించాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో నీతి ఆయోగ్ డైరెక్టర్ అంకుశ్ వధేరా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేస్తూ ప్రాజెక్టు లక్ష్యాలు టీం అప్రోచ్ గురించి వివరించారు. ఎపికి సంబంధించి తీర ప్రాంతంలో వాణిజ్యం, పర్యాటకం, షిప్ బిల్డింగ్ వంటి రంగాల్లో అభివృద్ధికి అవకాశం ఉందని తెలిపారు. అలాగే వ్యవసాయం, ఉద్యానవనం, ఆక్వాకల్చర్ రంగాల్లోనూ మరింత అభివృద్ధి చేయడం ద్వారా నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవచ్చని తెలిపారు. దీంతోపాటు హైవ్యాల్యూ ఇండస్ట్రీస్ క్లస్టర్లు, నెక్స్ట్ జనరేషన్ సర్వీస్ హబ్, పట్టణాలు, నగరాల్లో ఆర్థిక, సామాజికాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపైనా వివరించారు. ఈ సమావేశానికి ప్రణాళికాశాఖ కార్యదర్శి గిరిజాశంకర్ స్వాగతం పలికారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, కమిషనరు సురేష్‌కుమార్, వైద్యారోగ్యశాఖ కమిషనర్ నివాస్, నీతి ఆయోగ్ ప్రతినిధి బృందం సలహాదారు పార్థసారథి రెడ్డి పాల్గొన్నారు.

గిరిజన సంపదపై సిఎం కన్ను

టిడిపి ఎస్‌టి సెల్ అధ్యక్షులు ధారునాయక్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉత్తరాంధ్ర గిరిజన సంపదపై సిఎం కన్ను పడిందని, దాన్ని దోచుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చూస్తున్నారని టిడిపి ఎస్‌టి సెల్ అధ్యక్షులు ధారునాయక్ విమర్శించారు. అందుకే రాజధానిని విశాఖకు తరలించాలని ఉవ్విళ్లూరుతున్నారని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లక్షలాది గిరిజన భూములను పంప్డ్‌హైడ్రో పవర్ ప్రాజెక్టు పేరుతో ఇప్పటికే తన బినామీలకు జగన్ పంచిపెట్టారని విమర్శించారు.

దళితులపై దుర్మార్గాలు : వర్ల రామయ్య

అధికారం కట్టబెట్టిన దళితులపైనే దుర్మార్గాలు ఎందుకని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ప్రశ్నించారు. దళిత యువకుడిని దారుణంగా చంపి శవాన్ని డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీని సామర్లకోట సభలో పక్కన కూర్చోబెట్టుకోవడం ఏమిటని నిలదీశారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దళిత వైద్యుడైన సుధాకర్ మరణానికి కారణం జగన్ అని ఆరోపించారు. ఉపముఖ్యమంత్రి నారాయణ స్వామికి చంద్రబాబు కుటుంబంపై నోరెత్తే అర్హత లేదని టిడిపి ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయ స్వామి అన్నారు.

విశాఖకు ఉద్యోగుల తరలింపుపై అస్పష్టత !

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖకు ఉద్యోగుల తరలింపు విషయంలో కొంత గందరగోళం నెలకొంది. ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల్లో కేవలం అధికారులకే బస లేక సిబ్బందికి కూడా అనేది స్పష్టత లేదు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, విభాగాల అధిపతులను మాత్రమే వివరాలు అడిగినట్లు స్పష్టంగా ఉంది. దీనిపై రాష్ట్ర సెక్రటేరియట్ ఉద్యోగుల్లో కొంత అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విశాఖలో సిఎం నాలుగు రోజులు ఉండేటట్లయితే అక్కడే ఉన్నతాధికారులు ఉండాల్సి ఉంటుంది. వారికి అవసరమైన ఏర్పాట్లు ఏమిటనేది సర్క్యులర్లో పొందుపరచలేదు. కేవలం అధికారులకు సంబంధించిన అంశాలనే ప్రస్తావించిన నేపథ్యంలో సిబ్బంది పరిస్థితి ఏమిటి ? అసలు రమ్మంటారా ? ఇక్కడే ఉండాలా ? అనేది స్పష్టత లేదు. సిబ్బంది తరలింపు పెద్దఎత్తున ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్రభుత్వం ఆ తరహా చర్యలు తీసుకుంటుందా లేదా అనేది ఇంకా తేలలేదు. మరోవైపు సెక్రటేరియట్ ఉద్యోగుల్లో ఎక్కువ మంది హైదరాబాద్ నుండి వస్తున్నారు. ఇప్పటికీ వారంలో ఐదురోజుల విధుల్లో ఉన్నారు. ఇప్పుడు వారందరూ విశాఖ వెళ్లాలంటే అంత తేలికైన విషయం కాదు. ప్రతి శుక్రవారం విజయవాడ, గుంటూరు నుండి రైలయితే ఆరుగంటలు, కారయితే నాలుగు గంటల్లో హైదరాబాద్ వెళ్లిపోతున్నారు. సోమవారం ఉదయం బయలుదేరి వస్తున్నారు. అదే విశాఖ అయితే హైదరాబాద్ వెళ్లడం కనీసం 11 గంటలకుపైగా పడుతుంది. పిల్లల చదువులు మధ్యలో ఉన్నాయి. కనుక సిబ్బందిని ఇప్పుడే రమ్మంటారా లేక వచ్చే విద్యా సంవత్సరం నుండి రమ్మంటారా అనేది స్పష్టత ఇవ్వలేదు. మరోవైపు సిఎం డిసెంబర్ నుండి విశాఖలోనే పాలన చేస్తానని ప్రకటించారు. అంటే ఆ సమయానికి అన్ని విభాగాల అధిపతులు అక్కడికి వెళ్లాల్సి ఉంది. వారికి అవసరమైన సిబ్బంది అవసరం ఉంటుంది. సిఎం సమీక్ష చేయాలంటే ఆయా విభాగాల అధిపతులు పూర్తిస్థాయి సమాచారం వెంట వెంటనే అందించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో అధికారి ఒకచోట, సిబ్బంది మరోచోట ఉంటే నివేదికలు తయారు చేయడం అంత తేలికైన విషయం కాదు. తయారయ్యే ప్రతి నివేదికపైనా విభాగంలో ఉన్న సెక్షన్ హెడ్, జాయింట్ సెక్రటరీ, సెక్రటరీ సంతకాలు తప్పనిసరిగా ఉండాలి. అనంతరమే ప్రిన్సిపల్ సెక్రటరీ, అక్కడ నుండి ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి వెళుతుంది. సమీక్షల్లో వాడే నివేదికలపై వీరు సంతకాలు చేయకపోయినా తయారీ సమయంలో మాత్రం ఎవరెవరు పరిశీలించారనే సమాచారం తప్పనిసరిగా ఉండాలి. ఈ క్రమంలో అక్కడకు పూర్తిగా కాకపోయినా సగం మందయినా వెళ్లాల్సి ఉంటుంది. దీనిపైనే సెక్రటేరియట్, ఇతర విభాగాల ఉద్యోగులు తర్జన భర్జన పడుతున్నారు.

రాజధాని రైతులకు ప్రభుత్వం కౌలు చెల్లించరాదు

- హైకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

రాజధాని అమరావతికి భూములిచ్చిన రైతులకు వార్షిక కౌలు చెల్లింపు వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. రాష్ట్ర ప్రభుత్వం వార్షిక కౌలు చెల్లించడాన్ని తప్పుపడుతూ న్యాయవాది బైరెడ్డి సాయి ఈశ్వర్‌రెడ్డి ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని విచారణకు స్వీకరిస్తున్నామని, భూములిచ్చిన రైతులు తమ వాదనలతో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ సోమవారం ఆదేశించారు. ఇంప్లీడ్ పిటిషన్‌ను అనుమతించడాన్ని రైతుల తరపున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు తీవ్రంగా వ్యతిరేకించారు. మేలో చెల్లించాల్సిన కౌలు ఈ ఏడాది ఇప్పటి వరకు చెల్లించలేదని రాజధాని రైతు పరిరక్షణ సమితి, అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య ఇతరులు వేసిన పిటిషన్లపై విచారణను ఈ నెల 30కు వాయిదా వేశారు.

అమరావతి రాజధానికి భూములిచ్చిన వారికి సిఆర్‌డిఎ కౌలు చెల్లించాలేగానీ రాష్ట్ర ప్రభుత్వం కాదని న్యాయవాది వివేకానంద విరూపాక్ష చెప్పారు. రాజధాని కోసం సేకరించిన భూముల కోసం రూ.1000 కోట్లతో డెవలప్‌మెంట్ ఫండ్‌ను ఏర్పాటు చేశారని, ఇది సిఆర్‌డిఎ వద్ద ఉంటుందని గుర్తు చేశారు. ఆర్థిక సమస్యలతో ఉన్న రాష్ట్రం డబ్బు చెల్లించడం సరికాదన్నారు. సిఆర్‌డిఎ చట్టంలోని సెక్షన్ 25 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ చర్య ఉందన్నారు. ఇంప్లీడ్ పిటిషన్‌ను అనుమతించడం చెల్లదని ఉన్నం వాదించారు. ఇంప్లీడ్ పిటిషన్ విచారణార్హతను తేల్చాలన్నారు. 2015 నుంచి కౌలు చెల్లిస్తుంటే అడ్డుకునే క్రమంలోనే ఇంప్లీడ్ పిటిషన్ దాఖలైందని చెప్పారు. భూములిచ్చిన రైతులకు అన్యాయం చేయడమేనని అన్నారు.

17 కిలోల బంగారం, రూ.2.5 కోట్ల నగదు స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో సోమవారం పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పెద్ద ఎత్తున బంగారం, వెండి.. భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. మియాపూర్‌లో నిర్వహించిన తనిఖీల్లో.. సరైన పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న 17 కిలోల బంగారం, 17.5 కిలోల వెండిని పోలీసులు సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి ఆభరణలను ఆదాయపు పన్ను శాఖకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. గాంధీనగర్ పరిధిలోని కవాడీగూడలో నిర్వహించిన తనిఖీల్లో రూ.2.09 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. ఆరురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మరోవైపు వనస్థలిపురంలో ఎల్‌బి నగర్ ఎస్‌ఒటి పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఎలాంటి పత్రాలు లేకుండా కారులో తరలిస్తున్న రూ.29.40 లక్షలు స్వాధీనం చేసుకొని వనస్థలిపురం పోలీసులకు అప్పగించారు. అయ్యప్ప సొసైటీలో వాహనాలను తనిఖీ చేస్తుండగా రూ.32 లక్షల నగదు పట్టుబడింది. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో మరో రూ.పది లక్షల నగదును పోలీసులు పట్టుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇసి ఆదేశాల మేరకు పోలీసులు రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

సిఐడి విచారణకు కిలారు రాజేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో సిఐడి విచారణకు టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సన్నిహితులు కిలారు రాజేష్ హాజరయ్యారు. సోమవారం తాడేపల్లిలోని సిట్ కార్యాలయంలో జరిగిన విచారణకు తన న్యాయవాదితో కలిసి హాజరయ్యారు. స్కిల్ కేసులో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టు కాగానే తనను కూడా అరెస్టు చేస్తారనే ఆందోళనతో రాజేష్ హైకోర్టులో ముందస్తు బెయిల్‌కు పిటిషన్ దాఖలు చేశారు. రాజేష్‌ను విచారణకు హాజరుకావాలంటూ సిఐడి సెక్షన్ 41ఎ కింద నోటీసులు ఇవ్వడంతో సోమవారం సిట్ కార్యాలయానికి విచారణ కోసం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజేష్-లోకేష్‌కు మధ్య సంబంధాలు, స్కిల్ డెవలప్‌మెంటు కేసుకు సంబంధించి పలు అంశాలను ప్రశ్నించినట్లు తెలిసింది. ఉదయం 10:30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విచారించిన అనంతరం మంగళవారం కూడా విచారణకు హాజరు కావాల్సి వుంటుందని నోటీస్ ఇచ్చినట్లు రాజేష్ మీడియాకు వివరించారు. 25 ప్రశ్నల వరకు సిఐడి అధికారులు అడిగారని, అందులో ఎక్కువగా స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధం లేనివి అడిగారని తెలిపారు.

సెలవుల మంజూరుకు పాట్లు

- జిఓ 179 అమలెన్నడు?
- హెచ్‌ఆర్‌ఎం లాగిన్స్‌లో కానరాని ఆప్షన్లు
- ఆందోళనలో గ్రామ, వార్డు సచివాలయాల ఎఎన్‌ఎమ్‌లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాలశాఖ పరిధిలో పనిచేసే ఎఎన్‌ఎమ్/హెల్త్ కార్యదర్శులకు సంబంధించి అన్ని రకాల సెలవులు ఉపయోగించుకోలేని పరిస్థితి నెలకొంది. ఉద్యోగి తమకు అవసరమైన సమయంలో సెలవులు పెట్టుకునేందుకు వీలుగా హెచ్‌ఆర్‌ఎం లాగిన్స్‌లో అన్ని రకాల సెలవుల ఆప్షన్స్ కనబడేలా ప్రోగ్రామ్ సెట్ చేయకపోవడంతో కేవలం సిఎల్, ఆప్షనల్ సెలవులు మాత్రమే వినియోగించుకోవాల్సి వస్తోందని ఎఎన్‌ఎమ్‌లు వాపోతున్నారు. రెగ్యులర్ అయినప్పటికీ హెచ్‌ఆర్‌ఎమ్ లాగిన్స్‌లో ఆప్షన్ చూపకపోవడంతో చైల్డ్‌కేర్ లీవ్స్, మెడికల్ లీవ్స్, వంటివి ఉపయోగించుకోలేక నష్టపోతున్నామని వారు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం ఆప్షనల్ హాలిడేస్ 5, సిఎల్స్ 15 మాత్రమే ఉపయోగించుకుంటున్నామని, అంతకు మించి ఒకరోజు సెలవు పెట్టినా వేతనం నష్టం పోవాల్సి వస్తోందని ఎఎన్‌ఎమ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల డిడిఒ, సూపర్‌వైజర్, మెడికల్ ఆఫీసరు సంతకాలు చేస్తేకానీ సెలవులు మంజూరు కావడం లేదని, పై అధికారుల్లో ఏ ఒక్కరూ సంతకం పెట్టకపోయినా సెలవు మంజూరు కాదని ఎఎన్‌ఎమ్‌లు పేర్కొంటున్నారు. ఎఎన్‌ఎమ్‌లు మహిళా శిశు సంక్షేమశాఖ, వైద్యారోగ్యశాఖ సంయుక్త నియంత్రణలో ఉండటంతో తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన ఉద్యోగులు ఒకేశాఖ పరిధిలో ఉండటంతో లాగిన్‌లో ఆప్షన్స్ కనబడకపోయినా ముందు సెలవులు ఇస్తున్నారన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జిఓ నెంబరు 179ని అమలు చేయకపోవడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని, అర్హత కలిగిన వారందరినీ ఎంపిహెచ్ఎ (ఫిమేల్) వర్తింపజేయాలని ప్రభుత్వానికి ఎఎన్‌ఎమ్‌లు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే వైద్యారోగ్యశాఖ జిఓ 143ని విడుదల చేసినప్పటికీ పిహెచ్‌సిలో రెగ్యులర్ అయి, మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో బేసిక్ పే తీసుకుంటూ ఎంపిహెచ్ఎగా విధులు నిర్వహిస్తున్న వారిలో కొందరిని ఖాళీలున్న చోట గ్రామ, వార్డు సచివాలయాల్లో భర్తీ చేశారు. ఎంపిహెచ్ఎగా విధులు నిర్వహిస్తున్న వారితోపాటు విఆర్ఒ, గ్రామ సర్వేయర్లు, వెటర్నరీ అసిస్టెంట్లకు బయోమెట్రిక్ ఎక్కడైనా వేసుకునే అవకాశం ఇవ్వగా, తాము మాత్రం కచ్చితంగా సచివాలయంలో బయోమెట్రిక్ వేయాల్సి వస్తోందని, వ్యాక్సినేషన్‌లో ఉన్న సమయం, పాఠశాలలకు వెళ్లిన సమయాల్లో సచివాలయానికి వచ్చి బయోమెట్రిక్ వేయడం ఎఎన్‌ఎమ్‌లకు ఇబ్బందిగా మారింది. ఒకే సచివాలయంలో పనిచేసే ఎంపిహెచ్ఎ, ఎఎన్‌ఎమ్‌లు ఒకే రకమైన విధులు నిర్వహిస్తున్నా.. వారికి ఉన్న సడలింపులు తమకు కూడా కల్పించాలని ఎఎన్‌ఎమ్‌లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. మ్యూచువల్ బదిలీలకు మాత్రమే అనుమతిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రమోషన్ ఛానెల్‌లో పుట్టిన తేదీ, జాయినింగ్ తేదీ ఆధారంగా ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఆర్‌సిహెచ్ పోర్టల్‌లో గర్భిణులు, బాలింతలు వివరాలు నమోదు చేసినదానికి అలవెన్స్ నెలకు రూ.2 వేలు కేంద్రం నిధులు విడుదల చేస్తుండగా, అవి తమకు దక్కడం లేదంటున్నారు. తమపై యాప్‌ల భారంతోపాటు రికార్డుల పని ఎక్కువైందని ఎఎన్‌ఎమ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశే లక్ష్యం

- గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సిఇఒ ఇంతియాజ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌ను తయారు చేయడమే లక్ష్యంగా స్వయం సహాయక సంఘాలు చురుగ్గా పనిచేయాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ముఖ్య కార్య నిర్వహణాధికారి ఎమ్‌డి ఇంతియాజ్ పిలుపునిచ్చారు. సోమవారం స్వయం సహాయక సంఘాలు బాల్య వివాహాలకు వ్యతిరేకంగా క్యాంపెయిన్ నిర్వహించారు. ఇందులో భాగంగా 'లైవ్‌ఓత్' కార్యక్రమం సెర్ప్ కార్యాలయంలో జరిగింది. పంచాయతీరాజ్ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి రాజశేఖర్, సెర్ప్ సిఇఒ ఇంతియాజ్ సభ్యులతో ప్రమాణం చేయించారు.

డిసెంబరులోగా విశాఖకు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రులు ఆదిమూలపు సురేష్, బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, విడదల రజని, విశాఖ ఎంపి ఎంవివి.సత్యనారాయణ, ఇన్ఫోసిస్ ప్రతినిధులు నిలంజన్‌రాయ్ (చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్), నీలాద్రిప్రసాద్ మిశ్రా (వైస్ ప్రెసిడెంట్), మేయర్ గొలగాని హరివెంకటకుమారి, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, టిటిడి మాజీ చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీలో ప్రారంభోత్సవాలు

అనకాపల్లి జిల్లా పరవాడ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో యుజియో స్టెరైల్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీని, అచ్యుతాపురం ఎపి సెజ్‌లో లారస్ ల్యాబ్స్ యూనిట్-2 ఫార్ములేషన్ బ్లాక్‌ను జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. రూ.300.78 కోట్లతో నిర్మించిన స్టెరైల్స్ ప్రయివేట్ లిమిటెడ్, ఫార్మా, బయోటెక్ యూనిట్ల ద్వారా 800 మందికి, రూ.421.70 కోట్లతో నిర్మించిన లారస్ యూనిట్ ద్వారా 600 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభించనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి అమర్‌నాథ్, ఎంపి డాక్టర్ సత్యవతి, ఎమ్మెల్యేలు అదీప్‌రాజు, యువి.రమణమూర్తిరాజు, పాల్గొన్నారు.

ఎక్కడికక్కడ నిర్బంధం

సిఎం పర్యటన నేపథ్యంలో ఉద్యమకారులు, ప్రతిపక్ష నేతలపై పోలీసులు తీవ్ర నిర్బంధం ప్రయోగించారు. ఎన్ఎఒబి, పరవాడ ఫార్మా, అచ్యుతాపురం సెజ్ నిర్వాసితుల సమస్యలపైనా, కాలుష్య సమస్యలు, పరిశ్రమల్లో ప్రమాదాలు, వేతన సమస్యలపైనా సిఎంకు వినతిపత్రాలు ఇవ్వకుండా సిపిఎం నాయకులను పోలీసులు అనకాపల్లి జిల్లాలో గృహ నిర్బంధం చేశారు. కొప్పాకలో నివాసముంటున్న సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావును గృహనిర్బంధంలో ఉంచారు. తాడి గ్రామాన్ని వేరొకచోటుకు తరలించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ, ఆ గ్రామస్తుడు గోవింద్ గ్రామస్తులతో కలిసి బయలుదేరుతుండగా వారిద్దరినీ అరెస్టు చేసి సబ్బవరం పోలీసు స్టేషన్‌కు తరలించారు. వినతిపత్రం ఇవ్వడానికి వెళ్తున్న సిపిఎం నాయకులను అచ్యుతాపురం జంక్షన్‌లో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో, వారు అక్కడ నిరసన తెలిపారు. వీరిని అచ్యుతాపురం పోలీసు స్టేషన్‌లో ముఖ్యమంత్రి వెళ్లిపోయే వరకు నిర్బంధించారు. రాంబిల్లిలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శివాజీని గృహనిర్బంధం చేశారు. విశాఖలో సిఐటియు జిల్లా కార్యదర్శి పి.మణిని, సమైక్య ప్రజా, రైతు సంక్షేమ సంఘం కార్యదర్శి టివి.కృష్ణంరాజును గృహ నిర్బంధంలో ఉంచారు. టిడిపి, జనసేన నేతలనూ పోలీసులు ఎక్కడికక్కడ నిర్బంధించారు. అక్రమ అరెస్టులను సిపిఎం విశాఖ, అనకాపల్లి జిల్లా కమిటీలు ఖండించాయి.

విశాఖకు తరలింపుపై న్యాయపోరాటం

- రాజధాని రైతుల నిర్ణయం
- త్వరలో హైకోర్టును ఆశ్రయించే యోచన

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

సిఎం క్యాంపు కార్యాలయంతోపాటు అధికార యంత్రాంగాన్ని విశాఖకు తరలించాలన్న ప్రభుత్వ ప్రయత్నాలపై న్యాయపోరాటం చేయాలని రాజధాని రైతులు యోచిస్తున్నారు. తొలుత హైకోర్టును ఆశ్రయించాలని భావిస్తున్నారు. ఈ మేరకు న్యాయ నిపుణులతో చర్చిస్తున్నామని అమరావతి జెఎసి నాయకులు తెలిపారు. రాజధానికి సంబంధించిన పలు అంశాలు సుప్రీంకోర్టులో విచారణ జరగాల్సి ఉండగా, కోర్టు ఉత్తర్వులకు భిన్నంగా పరిపాలన యంత్రాంగాన్ని విశాఖకు తరలించాలనే ప్రయత్నాలు కోర్టు ధిక్కరణ కిందే వస్తుందని న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ చెబుతున్నారు. రాజధాని తరలింపును నిలిపివేయాలని, అమరావతినే అభివృద్ధి చేయాలని గతేడాది మార్చిలో హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకుండా ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టులో విచారణ పెండింగ్‌లో ఉండగా ఉత్తరాంధ్ర అభివృద్ధి పేరిట సిఎం క్యాంపు కార్యాలయం తరలింపును రాజధాని రైతులు తప్పుపడుతున్నారు. ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జిఒ 2015ను, సిఎం క్యాంపు కార్యాలయ తరలింపును నిలిపివేయాలని తొలుత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని యోచిస్తున్నారు. అయితే, సిఎం క్యాంపు కార్యాలయం ఎక్కడైనా ఉండవచ్చని, ఇప్పటికే కడపలో కూడా క్యాంపు కార్యాలయం ఉందని మంత్రి బొత్స ఇటీవల వ్యాఖ్యానించారు. తొలుత దసరాకే క్యాంపు కార్యాలయం తరలివెళ్తుందని ముందు భావించినా, తాజాగా సిఎం జగన్ వచ్చే డిసెంబరు నాటికి తాను విశాఖ వస్తానని సోమవారం ప్రకటించారు. కోర్టును ఆశ్రయించే అంశంపై చర్చలు జరుగుతున్నాయని అమరావతి జెఎసి నాయకులు తెలిపారు.

వార్షిక కౌలు కోసం హైకోర్టులో పిటిషన్

రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు ఈ ఏడాది ఇంతవరకూ వార్షిక కౌలు ఇవ్వకపోవడంతో సోమవారం రైతులు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయవాది ఇంద్రనీల్‌బాబు ఆధ్వర్యంలో 29 గ్రామాలకు చెందిన రైతుల తరుపున పిటిషన్ దాఖలు చేయగా, కౌంటర్ దాఖలు చేయాలని సిఆర్‌డిఎను కోర్టు ఆదేశించింది. దసరా తరువాత విచారణ చేపడతామని తెలిపింది. 2016 నుంచి 2019 వరకు ప్రతి ఏటా ఏప్రిల్ నుంచి మే చివరిలోగా వార్షిక కౌలు సొమ్ము రైతుల ఖాతాల్లో జమైంది. అయితే, గత నాలుగేళ్లుగా జాప్యం చేస్తున్నారని రైతులు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ ఏడాది చాలామందికి ఇంతవరకూ వార్షిక కౌలు జమకాలేదు. ఇప్పటికే కోర్టును ఆశ్రయించిన దాదాపు 2400 మందికి మాత్రమే జమైంది. మిగతా వారికి జమకాలేదు. కోర్టులో



కౌలు కోసం ఆందోళన చేస్తున్న రాజధాని రైతులు (ఫైల్ ఫొటో)

పిటిషన్ వేయగానే సంబంధిత పిటిషన్‌దారులకు మాత్రమే కౌలు చెల్లిస్తున్న సిఆర్‌డిఎ అధికారులు మిగతా వారి గురించి పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. రాజధాని నిర్మాణ నిమిత్తం 2015లో సిఆర్‌డిఎకి భూములు అప్పగించిన 22,736 మంది రైతులకు పదేళ్లపాటు ఏటా పది శాతం పెంచేలా అప్పటి టిడిపి ప్రభుత్వం రాజధాని రైతులకు కౌలు సాయం ప్రకటించింది. మెట్ట భూములకు ఎకరాకు రూ.30 వేలు, మూడు పంటలు పండే జరీబు భూముల రైతులకు ఎకరాకు రూ.50 వేలు కౌలు అప్పటి టిడిపి ప్రభుత్వం నిర్ధారించింది. ఈ మొత్తంపై ఏటా పది శాతం పెంచి రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ విధానాన్ని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగి స్తోన్నా, చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చేస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూ సమీకరణలో 22,736 మంది రైతులు 33,717 ఎకరాల భూములు ఇవ్వగా మూడేళ్లలో అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇస్తామని, పదేళ్లపాటు కౌలు చెల్లిస్తామని సిఆర్‌డిఎ ప్రకటించింది. కానీ, ఇంతవరకు అభివృద్ధి చేసిన ప్లాట్లు రైతులకు అప్పగించలేదు. చివరికి కౌలు చెల్లింపుల్లో జాప్యంపై విసిగివేశారిన రైతులు కోర్టును ఆశ్రయించారు. గత రెండేళ్లుగా అసైన్డ్ రైతులకు కూడా కౌలు పరిహారం నిలిచిపోయింది. 29 గ్రామాల్లో మూడు వేల మంది అసైన్డ్ రైతులు ఉన్నారు. వీరి భూములను కూడా రాజ ధానికి తీసుకున్నారు. అయితే, అసైన్డ్ భూముల అప్పగింతలో అక్రమాలు జరిగాయని సిఐడి అధికారులు దర్యాప్తు చేస్తు న్నారు. ఈ దర్యాప్తు పెండింగ్‌లో ఉండడంతో కౌలు పరిహారం నిలిపివేశారు.

'ఆపిల్ రైతులకు పరిహారం ఇవ్వాలి'

శ్రీనగర్ : భారీ వడగళ్ల వానతో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని యాపిల్ ఫార్మర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఆదివారం షోషియాన్, కుల్గామ్ జిల్లాల్లో కురిసిన భారీ వడగాళ్ల వాన భారీ నష్టాన్ని కలగజేసిందని తెలిపింది. ప్రభుత్వం వెంటనే నష్టపరిహారాన్ని అంచనా వేసి రైతులకు సకాలంలో పరిహారాన్ని అందచేయాలని కోరింది. క్రాప్ ఇన్సూరెన్స్ స్కీమ్‌ను అమలు చేయకపోవడాన్ని ఫెడరేషన్ ప్రశ్నించింది .

విద్యుత్ భారాలపై నిరసన

- వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళనలు



ఒంగోలు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి - యంత్రాంగం

విద్యుత్ భారాలు తగ్గించాలని, ట్రూఅప్ ఛార్జీలను రద్దు చేయాలని, విద్యుత్ చట్ట సవరణను ఆపాలని, స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేయవద్దని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ భవన్, కలెక్టరేట్ల వద్ద ఆందోళనలు చేపట్టారు. భారాలు తగ్గించాలని అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. విద్యుత్తు రంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువస్తోన్న సంస్కరణలను ప్రతిఘటించాలని పలువురు నాయకులు కోరారు.

కర్నూలులో విద్యుత్ భవనం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ.. అధికారంలోకొస్తే కరెంటు చార్జీలు పెంచనని చెప్పిన సిఎం జగన్.. అధికారంలోకి వచ్చిన తర్వాత అరుసార్లు కరెంట్ చార్జీలు పెంచి ప్రజలపై రూ.వందల కోట్ల భారాలు వేశారని విమర్శించారు. ఇంధన సర్దుబాటు ఛార్జీ పేరుతో 2014-15 నుండి 2018-19 సంవత్సరంలో యూనిట్‌కు ఏడు పైసలు 18 నెలలపాటు వసూలు చేశారని, 2020-21 సంవత్సరంలో వాడిన కరెంటుకు ఇంధన సర్దుబాటు ఛార్జీ పేరుతో యూనిట్‌కి 23 పైసలు చొప్పున పెంచారని, మళ్లీ ఈ సంవత్సరం ఏప్రిల్, మే, జూన్ నెలలో వాడిన కరెంటుకు ఇంధన సర్దుబాటు ఛార్జీ పేరుతో యూనిట్‌కు 40 పైసల చొప్పున కరెంట్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం వేయడం దుర్మార్గమన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ట్రిబుల్ షాక్ ఇచ్చిందని విమర్శించారు.

విశాఖలోని మల్కాపురం, చినగంట్యాడ విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద నిరసన తెలిపారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. నగరంలోని విద్యుత్ సౌధా వద్ద తలపెట్టిన నిరసన కార్యక్రమంలో జివిఎంసి 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోపుతున్న విద్యుత్ భారాలను ప్రతిఘటించాలని కోరారు. శ్రీకాకుళం నగరంలోని ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ కార్యాలయం వద్ద, విజయనగరం జిల్లా బొబ్బిలి ఎన్‌టిఆర్ బొమ్మ సెంటర్, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు.

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని పలు మండలాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం బస్టాండ్ వద్ద ప్రజాబ్యాలెట్ నిర్వహించారు. మండల కేంద్రమైన పెంటపాడులో వామపక్షాల ఆధ్వర్యాన కరపత్రాలు పంపిణీ చేశారు. ఒంగోలు కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై విద్యుత్ బిల్లుల రూపంలో ప్రజలకు షాక్ ఇస్తున్నాయన్నారు.

సిఎం వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర రాజధాని అంశం సుప్రీంకోర్టులో విచారణలో వుండగా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతారాహిత్యంగా ప్రకటనలు చేయడం తగదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. డిసెంబరు నుంచి విశాఖపట్నం పరిపాలన రాజధానిగా వుంటుందని తాను ఇక్కడే వుంటానంటూ సిఎం జగన్ వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిఎంకు కోర్టులంటే లెక్కలేనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సిఎం వ్యక్తిగత నివాసాన్ని ఎక్కడైనా ఏర్పాటు చేసుకునే అవకాశం వుందని, అయితే రాజధాని అంశం సుప్రీంకోర్టులో విచారణలో వుండగా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని అన్నారు. ఐదు కోట్ల మంది ఆంధ్రులున్న రాష్ట్రాన్ని రాజధాని లేని రాష్ట్రంగా మార్చారని విమర్శించారు.

రైళ్ల పునరుద్ధరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

లింగంపల్లి-విశాఖపట్నం, మచిలీపట్నం-విశాఖపట్నం మధ్య రైళ్లను ఈ నెల 17 నుంచి పునరుద్ధరిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

16న నడవాల్సిన విశాఖ, లింగంపల్లి రైలు 17న, 17న నడవాల్సిన లింగంపల్లి-విశాఖపట్నం రైలు 18న, 16న నడవాల్సిన మచిలీపట్నం-విశాఖపట్నం రైలు 17న, 17న నడవాల్సిన విశాఖపట్నం-మచిలీపట్నం రైలు 18న నడుస్తుందని దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది.



వర్కుషాపులో మాట్లాడుతున్న డాక్టర్ గేయానంద్

శాస్త్రీయ దృక్పథాన్ని ప్రచారం చేద్దాం

- నవంబర్ 7 నుంచి క్యాంపెయిన్
- ఎఐపిఎస్ఎన్ వర్కుషాపులో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

ప్రజాశక్తి - కాకినాడ

దేశవ్యాప్తంగా శాస్త్రీయ దృక్పథాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.గేయానంద్ కోరారు. కాకినాడలోని జెఎన్‌యుకెలో ఆలిండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ (ఎఐపిఎస్ఎన్) ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ రిసోర్స్ పర్సన్స్ వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సైన్స్ వ్యతిరేక, హేతువిరుద్ధ అంశాలకు ఇటీవల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యతనిస్తూ శాస్త్రీయతను, ప్రశ్నించే తత్వాన్ని బలహీనపరచాలని చూస్తున్నాయన్నారు. వీటికి వ్యతిరేకంగా పోరాడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. శాస్త్రీయతతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఫెసిలిటేటర్లుగా హాజరైన ఎఐపిఎస్ఎన్ జనరల్ సెక్రటరీ ఆశా మిశ్రా, ఎఐపిఎస్ఎన్ సైంటిఫిక్ టెంపర్ డెస్క్ కన్వీనర్ ప్రొఫెసర్ అరుణభమిశ్ర మాట్లాడుతూ.. సైన్సును ప్రచారం చేయడం అనేది విద్యావంతులు, సైన్స్ రంగ కార్యకర్తల సామాజిక బాధ్యతన్నారు. మానవ మనుగడకు, సమాజ ప్రగతికి కారణమైన సైన్సును ప్రచారం చేసేందుకు శాస్త్రవేత్తలు మేరీ క్యూరీ, సివి.రామన్ పుట్టినరోజు అయిన నవంబర్ ఏడు నుంచి ఈ క్యాంపెయిన్ ప్రారంభించి, జాతీయ సైన్సు దినోత్సవం ఫిబ్రవరి 28 వరకు వివిధ దశల్లో దేశ వ్యాప్తంగా కొనసాగించాలని కోరారు. సైన్స్‌పై అవగాహనను పెంపొందించేందుకు రచయితలు, కళాకారులు, మెజీషియన్లు, సోషల్ మీడియా కార్యకర్తలతో రాష్ట్ర, జిల్లా స్థాయిలో శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. శాస్త్రీయ అవగాహన పెంపొందించడం కోసం ఈ వర్క్ షాప్‌లో విద్యార్థులకు, ప్రజలకు వివిధ సైన్స్ ప్రయోగాలను చేసేందుకు రిసోర్స్ పర్సన్‌లకు శిక్షణ ఇచ్చారు. 'విశ్వం ఆవిర్భావం-మానవుని పుట్టుక' అనే అంశంపై నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కాలేషా బాషా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. దేశంలో కులవ్యవస్థ, అంటరానితనం వంటి అమానవీయ దురాచారాలు వ్యవస్థీకృతం అయ్యాయన్నారు. ఈ క్రమంలో ఏర్పడిన మూఢాచారాలు, అశాస్త్రీయ ధోరణుల నుంచి సమాజాన్ని మార్చేందుకు సైన్స్ సంస్థలు, ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. వివిధ రాష్ట్రాలకు చెందిన వంద మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ వర్క్‌షాప్‌నకు ఎఐపిఎస్ఎన్ జాతీయ కార్యవర్గ సభ్యులు జి.మురళీధర్ అధ్యక్షత వహించారు. జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కెఎంఎంఆర్.ప్రసాద్, టి.త్రిమూర్తులు, కె.శ్రీనివాస్, కెవివి సత్యనారాయణ, వైఎస్.నాగేశ్వరరావు, నిర్మల, డాక్టర్ కాలేషా, పివి.గోపాలరావు, జి.గిరిధర్, కాకినాడ జిల్లా నాయకులు వి.శ్రీరామారావు, వర్మ తదితరులు పాల్గొన్నారు.

దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే తీవ్ర చర్యలు

- రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ అప్పారావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దసరా సెలవుల్లో ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థలు తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ప్రకటించిన దసరా సెలవుల్లో విద్యా సంస్థలు తరగతులు లేదా ఆన్‌లైన్ తరగతులు నిర్వహించినా తప్పక ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకుంటామన్నారు. సోమవారం మంగళగిరిలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ కార్యాలయంలో అప్పారావు మాట్లాడుతూ.. కొన్ని జిల్లాల్లో సెలవుల విషయంలో ప్రభుత్వ నియమ, నిబంధనలను కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు పాటించడం లేదని కమిషన్ కార్యాలయానికి ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నాయని, మరికొన్ని విద్యాసంస్థలు మొబైల్ ఫోన్ ద్వారా హోమ్‌వర్కులు చేయాలని బాలలకు ఒత్తిడి తీసుకొస్తున్నాయని పేర్కొన్నారు. మండల, జిల్లా స్థాయి విద్యాశాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, తరగతులు నిర్వహిస్తే పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని ఆదేశించారు.

సంపాదకీయం

మరో అక్రమం

కార్పొరేట్ దిగ్గజం అదానీ అక్రమాలు ఒక్కొక్కటిగా బయల్పడుతున్నాయి. భారీ మొత్తంలో పన్నుల ఎగవేత, అక్రమ పద్ధతుల్లో కంపెనీ షేర్ విలువ పెంపు ఇత్యాది ఆర్థిక కుంభకోణాలకు అదానీ గ్రూపు పాల్పడిందని అంతర్జాతీయ ఆర్థిక విశ్లేషణ సంస్థ హిండెన్‌బర్గ్ నివేదిక ప్రకంపనలు ఉండగానే అదానీ బొగ్గు బాగోతాన్ని లండన్ నుంచి వెలువడుతున్న ప్రముఖ పత్రిక 'ఫైనాన్షియల్ టైమ్స్' బయట పెట్టింది. మార్కెట్ ధరల కంటే రెట్టింపు ధరలకు బొగ్గును దిగుమతి చేసుకున్నట్లు తప్పుడు బిల్లులు చూపించి బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి సంస్థల నుంచి కోట్లాది రూపాయలు కొల్లగొట్టారన్నది ఆ పత్రిక కథనం సారాంశం. అదానీ చేతివాటం కేవలం బొగ్గు వినియోగదారులకే పరిమితం కాలేదు. బొగ్గు ధరలు పెంచడం మూలంగా థర్మల్ విద్యుదుత్పత్తి వ్యయం అమాంతం పెరిగేందుకు చక్రం తిప్పారు. ఫలితంగా ఈ కాలంలో ప్రజలకు కరెంట్ ఛార్జీల భారం తడిసి మోపెడైంది. చిన్న పరిశ్రమలకు, వ్యాపారులకు విద్యుత్ ఛార్జీలు ఇబ్బడిముబ్బడిగా పెరిగి ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. అంతేనా, డిమాండ్ కనుగుణంగా విద్యుదుత్పత్తి జరగనీకుండా, ఉత్పత్తిలో ఎగుడు దిగుడులు, ఒడుదుడుకులకు, కృత్రిమ కొరత ఏర్పడటానికి, తద్వారా మరింతగా విద్యుత్ అమ్మకపు ధరలు పెరగడానికి కారణమయ్యారు. ఉత్తరోత్తరా దేశీయ విద్యుత్ రంగాన్ని అదానీ తన గుప్పెట్లో పెట్టుకొని శాసిస్తున్నారని అర్ధమవుతుంది.

వాస్తవానికి 'ఫైనాన్షియల్ టైమ్స్' కొత్తగా ఏమీ చెప్పలేదు. హిండెన్‌బర్గ్ నివేదికలోని అంశాలను తన సునిశిత పరిశీలనలతో అదానీ వైట్ కాలర్ నేరాన్ని మరింత బలోపేతం కావించింది. 2019-21 మధ్య 32 మాసాలలో 30 సార్లు జరిపిన బొగ్గు దిగుమతులకు సంబంధించి కస్టమ్స్, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) రిపోర్టుల్లో పేర్కొన్నట్లు గతంలో హిండెన్‌బర్గ్ వెల్లడించిన నివేదికలోని విషయాలు నిజమేనని 'ఫైనాన్షియల్ టైమ్స్' కథనం నిర్ధారించింది. మధ్యవర్తులను ఉపయోగించి అధిక ధరలపై బొగ్గును దిగుమతి చేసుకున్నామని చెప్పి, భారతీయ విద్యుత్ కంపెనీలకు అంతకంటే రెట్టింపు ధరలకు అదానీ అంటగట్టారు. కాగా ఎగుమతుల వద్ద ధరకు, దిగుమతి వద్ద ధరకు మధ్య భారీ వ్యత్యాసం ఉంది. వాస్తవ ధర కంటే నకిలీ ఇన్వాయిస్‌లతో ధరలను పెంచేశారు. గత రెండేళ్లుగా తైవాన్, దుబాయి, సింగపూర్ దేశాలలో బ్రోకర్ల ద్వారా రూ.40 వేల కోట్ల విలువైన బొగ్గు దిగుమతికాగా, కృత్రిమంగా ధరలు పెంచినట్లు డిఆర్ఐ పరిశోధనలో వెల్లడించింది. బొగ్గు ధరల పెంపు స్కాంపై 2016 లోనే డిఆర్ఐ పలువురికి నోటీసులివ్వగా, వారిలో అదానీ గ్రూపు వారే అత్యధికంగా ఉన్నారు.

ఇన్నేళ్లకు కూడా అదానీ ఆర్థిక అరాచకాలు ఆగకుండా అప్రతిహతంగా సాగిపోతున్నాయంటే మతలబు ఎక్కడుంది? దేశ ఆర్థిక వ్యవస్థను తొలిచేస్తున్న అదానీ ఉదంతాన్ని హిండెన్‌బర్గ్ బయటపెట్టాక కూడా, సదరు అక్రమాల నిరోధానికి కానీ, జరిగిన దోపిడీపై విచారణకు కానీ మోడీ ప్రభుత్వం ఇసుమంతైనా స్పందించపోవడాన్ని బట్టి అదానీ, మోడీ సర్కారుకు మధ్య బంధం ఎలాంటిదో అర్థమవుతుంది. జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి) విచారణ డిమాండ్‌ను మోడీ నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ప్రత్యేక ప్యానెల్ ఏర్పాటు చేశాక కూడా కేంద్ర ప్రభుత్వంలో చలనం రాలేదు. అదానీపై తాము చేపట్టిన దర్యాప్తును ఎందుకు మధ్యలో నిలిపివేయాల్సి వచ్చిందో కోర్టుకు సెబి నివేదిక ఇస్తేకాని నిజం బయటకురాదు. ఇంత జరిగినా అదానీ ఆర్థిక సామ్రాజ్యానికి మోడీ ప్రభుత్వం కాపలా కాయడం ఆపలేదు సరికదా దేశ, విదేశాల్లో, రాష్ట్రాల్లో కొత్తగా అదానీకి ప్రాజెక్టులు, కాంట్రాక్టులు దక్కేలా మోడీ సర్కారు చేయని ప్రయత్నం లేదు. మన రాష్ట్రం విషయానికే వస్తే పోర్టులు, విలువైన భూములు, కొండలు, బీచ్‌శాండ్, పంప్డ్ స్టోరేజి, సోలార్, సహా పలు పవర్ ప్రాజెక్టులు, చివరికి థర్మల్ కేంద్రాల్లో వెలువడే బూడిద (ఫ్లయాష్).. సమస్తం అదానీకే కట్టబెట్టడం వెనుక కేంద్రం ఒత్తిడి తప్పనిసరిగా ఉండి తీరుతుంది. అదానీ, అటువంటి వారి దోపిడీ ఆగాలంటే వారికి కొమ్ముకాసే పాలన పోవాలి.

మహనీయుల మాట



ఏ విషయాన్నయినా నిగ్రహం కోల్పోకుండా వినగలిగే సామర్థ్యాన్ని విద్య ప్రసాదిస్తుంది.

- రాబర్ట్ ఫ్రాస్ట్,
అమెరికన్ కవి.

మెకార్థీయిజం - ప్రపంచీకరణ



ప్రభాత్ పట్నాయక్


'న్యూస్ క్లిక్'ను కేంద్ర ప్రభుత్వం వేటాడుతున్న తీరు చూస్తుంటే మన చిన్ననాటి 'పులి- మేక' కథ గుర్తుకొస్తోంది. ఒక పులి, ఒక మేక ఒకే నీటి ప్రవాహం దగ్గర దాహం తీర్చుకోడానికి చేరాయి. పులికి ఆ మేకను చంపడానికి ఒక సాకు కావాలి. అందుకని తాను తాగే నీటిని బురదమయం చేసేస్తోందని మేకపై ఆరోపించింది. కాని తాను ప్రవాహానికి దిగువన నిలబడి నీరు తాగుతూంటే ఎగువన ఉన్న పులి తాగే నీరు బురదమయం అవడానికి తానెలా కారణం ఔతానని ఆ మేక అడిగింది. అప్పుడు తాను తాగే నీటిని బురదమయం చేసింది ఆ మేక కాకపోయినా, ఆ మేక తండ్రి గతంలో తాను తాగిన నీటిని బురదమయం చేసిందని చెప్పి ఆ పులి తన దాడిని సమర్థించుకుంది.

కొన్ని నెలలుగా 'న్యూస్ క్లిక్'ను మోడీ ప్రభుత్వం వెంటాడుతోంది. ఆ సంస్థ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ ఆఫీసులో, ఇంటిలో కూడా ఢిల్లీ పోలీసులు వారాల తరబడి శోధించారు. ఏదైనా ఆర్థిక అవకతవక జరిగిన ఆధారం దొరుకుతుందేమోనని వారు వెతికారు. కాని ఎంత ప్రయత్నించినా 'న్యూస్ క్లిక్' మీద నేరారోపణ చేయడానికి వారికి ఏ విధమైన ఆధారమూ దొరకలేదు. అందులో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. ఎందుకంటే 'న్యూస్ క్లిక్' అటువంటి ఏ విధమైన అవకతవకలకూ పాల్పడలేదు. అందుచేత ఇప్పుడు పూర్తిగా కొత్త ఆరోపణకు పూనుకుంది ప్రభుత్వం. ఉగ్రవాదానికి పాల్పడిందన్నదే ఆ ఆరోపణ. డజన్ల కొద్దీ 'న్యూస్ క్లిక్' ఉద్యోగులను, వారికి వార్తలను అందించే విలేకరులను తెగ వేధించారు. ప్రబీర్ పుర్కాయస్థను, అమిత్ చక్రవర్తిని చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యుఎపిఎ-ఉపా) కింద అరెస్టు చేశారు. ఈ చట్టం ఎంత దుర్మార్గమైనదంటే, ఆరోపణలు ఎంత హాస్యాస్పదంగా, అర్ధరహితంగా ఉన్నప్పటికీ (ప్రస్తుతం ఈ కేసులో ఆ విధంగానే ఉన్నాయి కూడా) నిర్బంధం నుండి ఏ విధమైన ఉపశమనమూ లభించడం చాలా కష్టం.

ఆర్థిక నేరాలను ఆరోపించడంతో మొదలుబెట్టి ఇలా ఉన్నట్టుండి ఉగ్రవాదం ఆరోపణ వైపు ఫిరాయించడం ప్రభుత్వానికి స్వతహాగా తట్టిన ఆలోచన కాదు. 'న్యూయార్క్ టైమ్స్' పత్రికలో చాలా దుర్బుద్ధితో రాసిన ఒక వ్యాసం ప్రచురితమైంది. అందులో నెవెల్లి రాయ్ సింగం అనే ఒక సంపన్నుడైన అమెరికన్ పౌరుడు, చైనా ప్రభుత్వపు ప్రచార యంత్రాంగానికి చాలా సన్నిహితంగా ఉన్నాడని, అనేక మార్గాల ద్వారా చైనా ప్రభుత్వ ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకుపోడానికి భారీ మొత్తాలను ఖర్చు చేస్తున్నాడని, వాటిలో 'న్యూస్ క్లిక్' కూడా ఒకటని ఆ వ్యాసం ఆరోపించింది.

'న్యూయార్క్ టైమ్స్' వ్యాసం చాలా దుష్ట తలంపుతో రాసినటువంటిది. అమెరికాకు చెందిన ఏ చట్టమూ ఉల్లంఘించబడినట్టు అది చెప్పలేదు. చైనా ప్రపంచవ్యాప్తంగా ప్రచార కార్యకలాపాలు చేపట్టినట్టు, అందులో సింగం వంటి వ్యక్తుల పాత్ర ఉన్నట్టు అన్యాపదేశంగా కొన్ని సూచనలు మాత్రం చేయగలిగింది. "నేను ఏ రాజకీయ పార్టీలోనూ సభ్యుడిని కాను. నేను ఏ రాజకీయ పార్టీ తరఫునా కాని, ఏ ప్రభుత్వం తరఫునా కాని, వాటి ప్రతినిధుల తరఫునా కాని, పని చేయడం, వారి నుండి ఆదేశాలను స్వీకరించడం లేదా ఆదేశాలను అమలు చేయడం అనే ప్రసక్తి లేదు. నేను పూర్తిగా నా వ్యక్తిగత విశ్వాసాలకు, దీర్ఘకాలంగా కలిగివున్న నా వ్యక్తిగత అభిప్రాయాలకు అనుగుణంగా మాత్రమే వ్యవహరిస్తున్నాను" అని సింగం ఒక ఇ-మెయిల్‌ను 'న్యూయార్క్ టైమ్స్'కు పంపాడు. సింగం చేసిన ప్రకటనను 'న్యూయార్క్ టైమ్స్' నేరుగా ఖండించలేదు. సింగం ద్వారా గాని, అతని ద్వారా నిధులు పొందినట్టు ఆరోపణలకు గురైన ఏ సంస్థలు గాని అమెరికన్ చట్టాలను ఉల్లంఘించినట్టు నేరుగా ఆరోపించనూ లేదు (కెయిత్‌లిన్ జాన్‌స్టన్ ఆగస్టు 12, 2023న మంత్లీ రివ్యూలో రాసిన వ్యాసం ఈ అంశం మీద చాలా వివరాలను ఇచ్చింది). కాని 'న్యూయార్క్ టైమ్స్' చాలా విడి విడి ఘటనల వివరాలను తన వ్యాసంలో ప్రస్తావించింది. వాటిలో దేనిలోనూ సరుకు లేదు. ఆ వ్యాసం సింగం గాని, అతనితో లింకులు ఉన్నట్టుగా ఆరోపిస్తున్న సంస్థలు గాని ఏదైనా కుట్రలకు పాల్పడుతున్నట్టు ఆరోపించలేదు. కాని అ ఘటనలన్నింటినీ కలిపి చదివితే అంతర్జాతీయ స్థాయిలో చైనా ప్రభుత్వం పెద్ద స్థాయిలో కుట్రకు సన్నాహం చేసిందన్న భ్రమ కలుగుతుంది.

సింగం చేసిన చట్ట వ్యతిరేక చర్య ఏదీ లేదు. అతడితో సంబంధాలు కలిగివున్నట్టుగా 'న్యూయార్క్ టైమ్స్' ఆరోపించిన సంస్థలు సైతం ఏ విధమైన చట్ట వ్యతిరేక చర్యలకూ పాల్పడుతున్నట్టు లేదు. చైనా ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయిలో ఏవో ప్రచార కుట్రకు పాల్పడుతోందన్న 'న్యూయార్క్ టైమ్స్' ఆ కుట్రకు ఈ సంస్థలు గాని, సింగం గాని మద్దతు ఇస్తున్నట్టూ ఎక్కడా లేదు. కేవలం సామ్రాజ్యవాద వ్యతిరేక వైఖరిని, మార్క్సిస్టు అవగాహనను ప్రదర్శించడం తప్ప వాళ్ళు చేసిందేమీ లేదు. కాని 'న్యూయార్క్ టైమ్స్' ఆ సామ్రాజ్యవాద వ్యతిరేక వైఖరినే చైనా ప్రభుత్వ ప్రచార కుట్రగా చిత్రించింది. మెకార్థీ తరహాలో వేధింపుల పర్వానికి ఇటువంటి కుత్సితమైన వక్రీకరణలు నాందిగా ఉంటాయి. అమెరికా అటార్నీ జనరల్ మెర్రిక్ గార్లండ్ కు మార్కో రూబియో అనే సెనేటర్ ఒక లేఖ రాస్తూ యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్న అమెరికన్ వామపక్ష గ్రూపుల కార్యకలాపాలమీద విచారణ చేపట్టాలని, ఆ సంస్థలన్నీ చైనా కమ్యూనిస్ట్ పార్టీతో సంబంధాలు కలిగివున్నాయని, అమెరికాలో ఆ సంస్థలు అడ్డూ ఆపూ లేకుండా వ్యవహరిస్తున్నాయని ఆరోపించాడు.



> మన ఢిల్లీ పోలీసులకి అటువంటి జాగ్రత్తలేమీ అవసరం లేదు. ఎందుకంటే వాళ్ళ దగ్గర 'ఉపా' అనే ఒక ఆయుధం ఉంది. ఆ చట్టం కారణంగా, ఎవరి మీద ఏ విధమైన ఆరోపణలు చేసినప్పటికీ వాటిని రుజువు చేసే ఆధారాలను చూపవలసిన బాధ్యత పోలీసుల మీద లేదు. నెలల తరబడి, ఒక్కోసారి ఏళ్ళ తరబడి కూడా ఏ ఆధారాలనూ కోర్టుల ముందు ఉంచనక్కరలేదు. అందుచేత కేవలం 'న్యూయార్క్ టైమ్స్' పత్రికలో వచ్చిన వార్తను బట్టి (ఆ వార్తలో ఏ ఆధారాలూ లేకపోయినప్పటికీ) 'న్యూస్ క్లిక్' సంస్థ చైనా అనుకూల ప్రచారానికి పాల్పడుతోందని అర్థం లేని నిరాధారమైన ఆరోపణలకు పోలీసులు పూనుకున్నారు. నేను 'న్యూస్ క్లిక్'ను రెగ్యులర్‌గా చదువుతాను. చైనా ప్రభుత్వం అనుసరించే వైఖరితో ముడిపడి వున్న అంశం ఏదీ అందులో నాకు కనిపించలేదు. అంతర్జాతీయ పరిణామాలను వామపక్ష, మార్క్సిస్టు దృక్పథంతో విశ్లేషించడం మాత్రమే ఆ పత్రికలో చూస్తున్నాను. చైనా విప్లవం పట్ల ఆ పత్రికకు గౌరవం ఉంది. మూడో ప్రపంచ దేశాల్లో ఉండే వారిలో సామ్రాజ్యవాద వ్యతిరేక వైఖరిని అవలంబిస్తున్నట్టు చెప్పుకునే వారెవరికైనా చైనా విప్లవం పట్ల గౌరవం ఉండడం సహజం.

నిరాధారమైన ఆరోపణలను చేస్తే న్యాయపరంగా కేసుల్ని ఎదుర్కోవలసి వస్తుందని లాయర్లు సూచించినందువల్లనో ఏమో 'న్యూయార్క్ టైమ్స్' పత్రిక కేవలం అన్యాపదేశంగా ఆరోపణలను చేయడం వరకే పరిమితం అయింది. కాని, మన ఢిల్లీ పోలీసుల కి అటువంటి జాగ్రత్తలేమీ అవసరం లేదు. ఎందుకంటే వాళ్ళ దగ్గర 'ఉపా' అనే ఒక ఆయుధం ఉంది. ఆ చట్టం కారణంగా, ఎవరి మీద ఏ విధమైన ఆరోపణలు చేసినప్పటికీ వాటిని రుజువు చేసే ఆధారాలను చూపవలసిన బాధ్యత పోలీసుల మీద లేదు. నెలల తరబడి, ఒక్కోసారి ఏళ్ళ తరబడి కూడా ఏ ఆధారాలనూ కోర్టుల ముందు ఉంచనక్కరలేదు. అందుచేత కేవలం 'న్యూయార్క్ టైమ్స్' పత్రికలో వచ్చిన వార్తను బట్టి (ఆ వార్తలో ఏ ఆధారాలూ లేకపోయినప్పటికీ) 'న్యూస్ క్లిక్' సంస్థ చైనా అనుకూల ప్రచారానికి పాల్పడుతోందని అర్థం లేని నిరాధారమైన ఆరోపణలకు పోలీసులు పూనుకున్నారు. నేను 'న్యూస్ క్లిక్'ను రెగ్యులర్‌గా చదువుతాను. చైనా ప్రభుత్వం అనుసరించే వైఖరితో ముడిపడి వున్న అంశం ఏదీ అందులో నాకు కనిపించలేదు. అంతర్జాతీయ పరిణామాలను వామపక్ష, మార్క్సిస్టు దృక్పథంతో విశ్లేషించడం మాత్రమే ఆ పత్రికలో చూస్తున్నాను. చైనా విప్లవం పట్ల ఆ పత్రికకు గౌరవం ఉంది. మూడో ప్రపంచ దేశాల్లో ఉండే వారిలో సామ్రాజ్యవాద వ్యతిరేక వైఖరిని అవలంబిస్తున్నట్టు చెప్పుకునే వారెవరికైనా చైనా విప్లవం పట్ల గౌరవం ఉండడం సహజం.

ఉదారవాద బూర్జువా వైఖరికి, మెకార్థీ తరహా ఫాసిస్టు వైఖరికి మధ్య అంత:సంబంధం ఈ సందర్భంలో మనకి కనిపిస్తుంది. 'న్యూయార్క్ టైమ్స్' పత్రిక ప్రపంచంలో అమెరికన్ సామ్రాజ్యవాదం సాగించే యుద్ధాలనన్నింటినీ బలపరుస్తూ వుంటుంది. ఐనా, ఆ పత్రిక ఉదారవాద బూర్జువా దృక్పథాన్ని అనుసరించే పత్రికగానే పరిగణించబడుతూ వుంటుంది. ఉదారవాద బూర్జువా దృక్పథాన్ని బలపరిచేవారు సమాజంలో వ్యక్తం అయ్యే భిన్నాభిప్రాయాలను, వాటిని స్వేచ్ఛగా ప్రచారం చేసుకునే హక్కును గుర్తిస్తారు. అటువంటి ప్రచారం చట్టాలకు లోబడి వుండాలని మాత్రమే వారు చెప్తారు. అటువంటి వైఖరిని అనుసరించే 'న్యూయార్క్ టైమ్స్' పత్రిక ఈ మాదిరిగా వ్యాసాన్ని ప్రచురించడం మెకార్థీ తరహా వేధింపులను ప్రోత్సహించడమే ఔతుంది. సామ్రాజ్యవాద వ్యతిరేక, యుద్ధ వ్యతిరేక వైఖరిని అనుసరించడం పట్ల ప్రతికూలతను ప్రదర్శించడం అంటే సమాజంలో ఫాసిస్టు తరహా శక్తులను ప్రోత్సహించడమే.

ఫాసిస్టు శక్తులు ప్రభుత్వ అధికారం చేపట్టినప్పుడు వామపక్ష ప్రజాతంత్ర శక్తులను అణచివేయడానికి వారు ప్రయోగించే ఆయుధాలు అంతకు మునుపు అధికారంలో ఉండిన ఉదారవాద బూర్జువా ప్రభుత్వాలు రూపొందించినవే ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుతం అందరూ వ్యతిరేకిస్తున్న ఉపా చట్టం మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని ఉదారవాద బూర్జువా ప్రభుత్వ హయాంలోనే రూపొందింది. కేవలం సంస్థలకే వర్తించే ఆ చట్టాన్ని వ్యక్తులకు కూడా వర్తింపజేస్తూ మోడీ ప్రభుత్వం ఒక సవరణ తెచ్చింది. అందుచేత ఉదారవాద బూర్జువాల కమ్యూనిస్టు వ్యతిరేక వైఖరికి, ఫాసిస్టు అణచివేతకు మధ్య ఉన్న సంబంధాన్ని విస్మరించకూడదు.

ఇప్పుడు అమెరికాలో ఉన్నది ఒక ఉదారవాద బూర్జువా ప్రభుత్వం. అక్కడ మెకార్థీ తరహా వేధింపులకు అడుగు పడింది. దాని ప్రకంపనలు ఇక్కడ ఇండియాలో కనిపిస్తున్నాయి. ఇక్కడ ఉన్నది ఒక ఫాసిస్టు ప్రభుత్వం. అంటే మెకార్థీయిజం ప్రపంచ వ్యాప్తం అవుతోందన్నమాట. ప్రస్తుత ప్రపంచీకరణ దశలో మెకార్థీయిజాన్ని కూడా ప్రపంచీకరిస్తున్నారు జినోవీవ్ రాసినట్టు ఒక బూటకపు లేఖను సృష్టించి 1924లో బ్రిటన్‌లో కమ్యూనిస్టు బూచిని ముందుకు తెచ్చారు. అప్పుడు అధికారంలో ఉండిన రామ్సే మెక్‌డొనాల్డ్ తాలూకు లేబర్ పార్టీ ప్రభుత్వం కాస్తా ఆ తప్పుడు ప్రచారం దెబ్బకు కూలిపోయింది. అదేమాదిరిగా 1950 దశకంలో అమెరికాలో సెనేటర్‌గా ఉన్న మెకార్థీ కమ్యూనిస్ట్ ప్రమాదం ముంచుకొచ్చేస్తోందంటూ సాగించిన ప్రచారం అక్కడ కమ్యూనిస్టులను, వామపక్షవాదులను వేటాడడానికి దోహదం చేసింది. ఐతే ఆ కాలంలో ఆ వేట అమెరికాకే పరిమితం అయింది తప్ప ప్రపంచం మొత్తం మీద విస్తరించలేదు. కాని, ఇప్పుడు ప్రపంచీకరణ యుగంలో కమ్యూనిస్ట్ ప్రమాదం గురించి సృష్టించే అభూత కల్పనలు ఏ ఒక్క దేశానికో పరిమితం కావడం లేదు. ఒక చోట ప్రచారం మొదలైతే దాని హానికర ప్రకంపనలు ఇతర దేశాలకు విస్తరిస్తున్నాయి. తాను ఎవరిమీదా ఏ విధమైన ఆరోపణలనూ చేసినట్టు 'న్యూయార్క్ టైమ్స్' పత్రిక ఒప్పుకోకపోవచ్చు. కాని ఆ పత్రిక రాతలే ఇక్కడ మోడీ ప్రభుత్వ విషపు దాడులకు దోహదం చేశాయి. ఇక్కడ ఉన్న 'ఉపా' వంటి దుర్మార్గ చట్టాలు యథేచ్ఛగా ఉపయోగించబడుతున్నాయి. ధైర్యంగా ప్రభుత్వ చర్యలను ప్రశ్నించే అభ్యుదయవాదుల గొంతు నొక్కడానికి సాకుగా 'న్యూయార్క్ టైమ్స్' రాతలు ఉపయోగపడుతున్నాయి. ఇటువంటి పరిణామాలు జరిగే అవకాశం ఉందన్న సంగతి ఆ పత్రికకు బాగా తెలుసు. ఐనప్పటికీ అటువంటి నిరాధార వార్తలను ప్రచురించడానికే ఆ పత్రిక పూనుకుంది. అంటే వర్తమాన ప్రపంచంలో పాశ్చాత్య దేశాల ఉదారవాద బూర్జువా విధానం తీరు తెన్నులు ఏ విధంగా ఉన్నాయో మనం తెలుసుకోవచ్చు.

ప్రస్తుత ప్రపంచీకరణ యుగంలో మెకార్థీయిజం తీసుకున్న రూపమే చైనా వ్యతిరేక ప్రచారం. ఇక్కడ మోడీ ప్రభుత్వం ఒక్క అంగుళం భారత భూభాగాన్ని కూడా చైనాకు విడిచిపెట్టేది లేదని గట్టిగా ప్రకటిస్తూ వుంటుంది. కాని వాస్తవానికి మన సరిహద్దుల్లో అక్కడక్కడా కొంత భూభాగం చైనా అధీనంలోకి పోయిందన్న వార్తలు వెలువడుతున్నాయి. సహజంగానే అటువంటి వార్తలు ప్రజల్లో చైనా పట్ల వ్యతిరేకతను కలిగిస్తాయి. ఆ చైనా వ్యతిరేకతను ఇక్కడ కమ్యూనిస్టుల మీద, ప్రభుత్వ విమర్శకుల మీద సాగించే మెకార్థీ తరహా దాడుల సమర్థనకు ఉపయోగించుకుంటోంది మోడీ ప్రభుత్వం. దేశంలో ఏ కాస్త అయినా స్వతంత్రంగా వ్యవహరించే మీడియా ఉన్నా దాని గొంతు నొక్కడానికి 'చైనా' వ్యతిరేకతను ముందుకు తెస్తున్నది.

ఉదారవాద బూర్జువా దృక్పథం నిజంగా ఫాసిస్టు వ్యతిరేకతను అనుసరించాలంటే, ఫాసిస్టు మెకార్థీయిజానికి తోడ్పడకుండా ఉండాలంటే అది కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం చేయడం మానుకోవాలి. ప్రస్తుతం వేగంగా ప్రపంచవ్యాప్తంగా మెకార్థీయిజం విస్తరిస్తూ ఫాసిస్టు శక్తులు బలపడడానికి అనువైన వాతావరణాన్ని సృష్టిస్తున్నప్పుడు ఉదారవాద బూర్జువా శక్తులు ఈ స్పష్టతను కలిగివుండడం అత్యవశ్యం.

(స్వేచ్ఛానుసరణ)

సహకార రంగాన్ని కాపాడుకుందాం



పి.అజయ కుమార్

జులై 1న సహకార రంగ అంతర్జాతీయ దినోత్సవం జరుపుకున్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల వైపు ప్రగతి సాధనలో సహకార సంఘాల ప్రభావాన్ని గుర్తుచేసుకున్నారు. పేదరికం, ఆరోగ్యం, ఆకలి, సంక్షేమం సమస్యల పరిష్కారంలో సహకార రంగ పాత్రను శ్లాఘించారు. తమకు తామే సహాయం చేసుకునే యంత్రాంగంగా సహకార రంగం గుర్తించబడింది. భద్రతను, సాధికారతను కల్పించటంలో సహకార రంగం ముందు పీఠిన ఉంది.

ఇటీవల ఇండియాలో జరిగిన జి-20 సమావేశాల్లో సహకార రంగంపై చర్చ జరిగింది. ఇంటర్నెట్ ఆధారిత ఆర్థిక సేవల్లో సహకార రంగంతో పాటు ప్రైవేటు పెట్టుబడిదారీ సంస్థలకు కూడా చోటు కల్పించాలని నిర్ణయించారు. పూర్వం ఊహాజనిత సోషలిస్టులైన రాబర్ట్ ఓవెన్, చార్లెస్ ఫోరియర్‌లు కార్మికులు ఒక వర్గంగా యాజమాన్యం వహించేందుకు సహకార రంగం ఉపయోగపడుతుందని భావించారు. పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోయటానికి ఒక సాధనంగా సహకార రంగాన్ని ఉపయోగించుకోవాలని కారల్ మార్క్స్ సూచించారు. సహకార రంగం అభివృద్ధి చెందితే పెట్టుబడిదారీ వ్యవస్థ బలహీన పడుతుందని చెప్పారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలతో సమానంగా సహకార రంగం అభివృద్ధి చేయబడింది. రాష్ట్ర స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు ఉన్న సహకార సంఘాల్లో ప్రభుత్వం పెట్టుబడులు పెట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహాలతో సహకార రంగం రైతులకు, ప్రజలకు సేవ చేస్తూ అభివృద్ధి బాటలో నడిచింది. అటువంటి సహకార రంగాన్ని, ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు కూలగొట్టే పని సరళీకరణ విధానాల అమలు క్రమంలో ప్రారంభమైంది.

ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో ప్రభుత్వ రంగ, సహకార రంగ సంస్థలను మూసివేసేందుకు, ప్రైవేటీకరించేందుకు, వాటి సైజులను తగ్గించేందుకు నాటి టిడిపి ప్రభుత్వం నిర్ణయించి అమలు చేసింది. ప్రపంచ బ్యాంకు వద్ద వ్యవస్థీకృత సర్దుబాటు రుణం తీసుకుని దాని షరతులకు అనుగుణంగా సహకార రంగంలో సంస్కరణలు అమలు చేసింది.

> **సహకార రంగాన్ని కాపాడుకోకపోతే పూర్వకాలంలో లాగే రైతులు వడ్డీవ్యాపారుల కబంధ హస్తాల్లో పడి నలిగిపోతారు. ఒకరికొకరు సహాయం చేసుకునే వ్యవస్థ కుప్పకూలిపోకుండా కాపాడుకోవాలి. ఒకపక్క ప్రభుత్వ రంగంపై దాడి జరుగుతోంది. విద్యుత్తు, రైల్వే, బ్యాంకులు, ఇన్సూరెన్సు, చమురు వంటి కీలక రంగాల ప్రైవేటీకరణకు మోడీ ప్రభుత్వం బాటలు వేసింది. మరో పక్క ప్రైవేటు పెట్టుబడుల విస్తరణకు ఆటంకంగా ఉన్న సహకార రంగంపై వేటు వేస్తోంది. కేంద్ర మంత్రి అమిత్‌షా వేసే ఎత్తులకు మోసపోకుండా వాటిని తిప్పికొట్టాలి.**



ఆ సమయంలోనే ఒకప్పుడు వెలుగొందిన సహకార రంగం కుదేలైంది. సహకార చక్కెర మిల్లులు, నూలు మిల్లులు కనుమరుగయ్యాయి. ఇపుడు ఉన్న కొద్దిపాటి సహకార చక్కెర ఫ్యాక్టరీలు మూత దశలో ఉన్నాయి. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం తరువాత అధికారంలోకి వచ్చిన రాజశేఖర రెడ్డి ప్రభుత్వం, ప్రస్తుత వైసిపి ప్రభుత్వాలు సహకార రంగంలో సంస్కరణలను కొనసాగించాయి, కొనసాగిస్తున్నాయి. ప్రైవేట్ పెట్టుబడులకు అవకాశం కల్పించాయి.

రాష్ట్రంలో పాల వెల్లువలో ప్రముఖ పాత్ర పోషించిన సహకార పాల రంగం క్రమేపీ కనపడకుండా పోయింది. అక్కడక్కడ మిణుకు మిణుకుమంటోంది. ప్రముఖ సహకార డెయిరీలు కంపెనీలుగా మారిపోయాయి. సహకార చక్కెర మిల్లులను పునరుద్ధరిస్తామని కాంగ్రెసు, వైసిపి ప్రభుత్వాలు తాము చేసిన వాగ్దానాలను నిలబెట్టుకోలేదు. రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో సహకార సంఘాలు ఒకే ఫెడరేషన్ కింద లేకుండా అనేక ఫెడరేషన్లుగా విచ్ఛిన్నమయ్యే, ఆ తర్వాత ఆ ఫెడరేషన్లు కంపెనీలుగా మారే విధంగా చట్ట సవరణలు చేశారు.

సహకార రంగంలో మిగిలి ఉన్న ఏకైక వ్యవసాయ పరపతి విభాగాన్ని కూడా ప్రైవేట్ పెట్టుబడులకు అప్పగించే ప్రక్రియను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రారంభించింది. 50 శాతం వాటాలను ప్రైవేట్ కంపెనీలకు అప్పగిస్తూ చట్ట సవరణలు చేసింది. అదే సమయంలో సహకార రంగానికి పూర్వ వైభవం తెస్తామంటూ కేంద్ర ప్రభుత్వం, కేంద్ర పరిధిలో సహకార శాఖను ఏర్పాటు చేసింది. సహకార రంగాన్ని తన చేతిలోకి తెచ్చుకునేందుకు మోడీ ప్రభుత్వం చర్యలు మొదలు పెట్టింది. బహుళ రాష్ట్ర సహకార సంఘాల చట్టానికి సవరణ చేసి రాష్ట్ర పరిధిలో ఉన్న సహకార సంఘాలు బహుళ రాష్ట్ర సహకార సంఘాలుగా మారే దారి కల్పించింది. అపుడు అవి కేంద్రం అధీనంలోకి పోతాయి.

గుజరాత్ రాష్ట్రంలోని అమూల్ డెయిరీ ఇప్పటికీ గుజరాత్ సహకార పాల మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్ (జి.సి.ఎం.ఎం.ఎఫ్.ఎల్) పేరుతో ఒక రాష్ట్ర సహకార సంఘంగా ఉంది. రాష్ట్ర సహకార శాఖ పరిధిలో ఉంది. అది తన పాల ఉత్పత్తులను దేశంలో, విదేశాల్లో అమ్ముకుంటోంది. ఇతర ఐదు సహకార సంఘాలతో (ఇతర రాష్ట్రాలవి) విలీనం చేసి బహుళ రాష్ట్ర సహకార సంఘంగా మారుస్తామని కేంద్ర మంత్రి అమిత్‌షా 2022 లోనే ప్రకటించారు.

ఈ క్రమంలో అమూల్ డెయిరీ బహుళ రాష్ట్ర సహకార సంఘంగా మారినట్లు ఇంకా వార్తలు ఎక్కడా రాలేదు. మన రాష్ట్ర పాల ఫెడరేషన్‌ను కూడా బహుళ రాష్ట్ర సహకార సంఘంగా మార్చిన దాఖలాలు లేవు. అలా మారకుండానే మన రాష్ట్రంలో అమూల్ విస్తరణకు వైసిపి ప్రభుత్వం తోడ్పడుతోంది. ఒంగోలు, చిత్తూరు డెయిరీలను అది స్వాధీనం చేసుకుంది. పాల సేకరణ, పంపిణీ, పాల ఉత్పత్తుల తయారీ కోసం రాష్ట్రంలో యూనిట్లు ఏర్పాటు చేస్తోంది. రాష్ట్ర ప్రజలతో, రైతులతో సంబంధం లేకుండా మోడీ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వైసిపి ప్రభుత్వం నడుస్తోంది. చివరికి ఇది ఒక పెద్ద ప్రైవేటు కంపెనీగా మారే ప్రమాదం ఉంది.

ఒకే సహకార సంఘం పేరుతో గ్రామీణ సేవలన్నింటినీ ఒక గొడుగు కిందికి తెచ్చే విధానాన్ని మోడీ ప్రభుత్వం ప్రకటించింది. ఒకే సొసైటీలో పాలు, చేపలు, వ్యవసాయ రుణాలు, ఇతర వ్యవసాయ సేవలు, కామన్ సర్వీసులు తదితరాలన్నిటినీ కలుపుతామని పదే పదే కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తోంది. మోడీ ప్రభుత్వ విధానానికి అనుగుణంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన అన్ని రకాల సేవలను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలోకి వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో తెస్తోంది. అలా తేవటమేగాక పిఎసిఎస్ లలో వాటాలను 50 శాతం ప్రైవేట్ వ్యక్తులకు, కంపెనీలకు అమ్ముతూ 1964 ఏపి సహకార సంఘాల చట్టానికి సవరణలు చేసింది. ఆర్.బి.కె. లను ఈ చట్ట సవరణ ద్వారా పిఏసిఎస్ లలో విలీనం చేసింది. ధాన్య సేకరణ, ఎరువులు, గోడౌన్‌లతో సహా సహకార సేవలన్నీ ప్రైవేటుపరం కానున్నాయి.

మోడీ ప్రభుత్వ భారీ కుట్రలో రాష్ట్ర వైసిపి ప్రభుత్వం పాలు పంచుకుంటోంది. రాష్ట్రంలో సహకార వ్యవస్థ మొత్తం ఒకే గొడుగు కింద ప్రైవేటుపరం కానుంది. ఇది దేశం మొత్తంలో జరగబోయే పరిణామానికి ప్రారంభ సూచిక కానుంది. ఒకప్పుడు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు సంస్కరణలకు అనుగుణంగా సహకార విభాగాలను ఒక్కోటిగా కూలగొట్టింది. ఇపుడు వైసిపి ప్రభుత్వం ఇంకా మిగిలి ఉన్న ఆ విభాగాలన్నిటినీ ఒకే చోటికి చేర్చి ప్రైవేట్ పెట్టుబడులకు అప్పగిస్తున్నారు.

ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు ప్రధానంగా ఈ కుట్రకు వేదిక కానున్నాయి. వ్యవసాయ పరపతి రంగానికి సంబంధించిన పిఎసిఎస్‌లు, డిసిసిబిలు, ఆప్కాబ్ తదితరాలు మొత్తం ప్రైవేటీకరణ కానున్నాయి. ఈ రంగంలో ఉన్న ఉద్యోగులు మేల్కొనాలి. ఉద్యోగుల కంటె పిఎసిఎస్ లలో వాటాదారులుగా, పాలక మండళ్లుగా ఉన్న రైతులు పెద్ద ఎత్తున ఉద్యమించాలి. ప్రైవేటీకరణ కుట్రను తిప్పికొట్టాలి.

సహకార రంగాన్ని కాపాడుకోకపోతే పూర్వకాలంలో లాగే రైతులు వడ్డీవ్యాపారుల కబంధ హస్తాల్లో పడి నలిగిపోతారు. ఒకరికొకరు సహాయం చేసుకునే వ్యవస్థ కుప్పకూలిపోకుండా కాపాడుకోవాలి. ఒకపక్క ప్రభుత్వ రంగంపై దాడి జరుగుతోంది. విద్యుత్తు, రైల్వే, బ్యాంకులు, ఇన్సూరెన్సు, చమురు వంటి కీలక రంగాల ప్రైవేటీకరణకు మోడీ ప్రభుత్వం బాటలు వేసింది. మరో పక్క ప్రైవేటు పెట్టుబడుల విస్తరణకు ఆటంకంగా ఉన్న సహకార రంగంపై వేటు వేస్తోంది. కేంద్ర మంత్రి అమిత్‌షా వేసే ఎత్తులకు మోసపోకుండా వాటిని తిప్పికొట్టాలి. ఇది ఒక్క వ్యవసాయ పరపతి సహకార సంఘ పరిధి లోని రైతుల సమస్య మాత్రమే కాదు. మొత్తం రైతుల సమస్య. సహకార వ్యవస్థను ఒక చోటకు చేర్చి ప్రైవేటు కంపెనీలకు అప్పజెప్పే కుట్రను రైతులు, ప్రజలు అందరూ ఏకమై ఓడించాలి.

/ వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు /

'సుప్రీం'కు ప్రబీర్, అమిత్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

యుఎపిఎ కేసులో తమ అరెస్టును, రిమాండ్‌ను రద్దు చేసేందుకు నిరాకరించిన ఢిల్లీ హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకులు ప్రబీర్ పుర్కాయస్థ, హెచ్‌ఆర్ విభాగం అధిపతి అమిత్ చక్రవర్తి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం పిటిషన్ కాపీలను సర్క్యులేట్ చేయాల్సిందిగా పుర్కాయస్థ తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌ను కోరింది. అత్యవసర విచారణపై నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. 'ఇది న్యూస్‌క్లిక్ విషయం. జర్నలిస్టులు పోలీసుల అదుపులో ఉన్నారు. ఇక్కడ నిందితుల్లో ఒకరు 75 ఏళ్ల వృద్ధుడు' అని సిబల్ పేర్కొన్నారు. కఠినమైన ఉగ్రవాద నిరోధక చట్టం యుఎపిఎ ప్రకారం నిర్బంధ సమయంలో పోలీసులు రాతపూర్వక ఆధారాలను అందించాల్సిన అవసరం లేదని ఢిల్లీ హైకోర్టు ఇటీవలే తీర్పునిచ్చింది. అరెస్టు చేయడానికి గల కారణాలను రాతపూర్వకంగా ఇవ్వాలన్న పుర్కాయస్థ, చక్రవర్తి వాదనను తిరస్కరించింది. దీంతో పుర్కాయస్థ, చక్రవర్తి సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

చంద్రబాబు హెల్త్ బులిటెన్ ఇవ్వాలని పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆరోగ్యంపై డాక్టర్లు, జైలు అధికారులు, వైసిపి నాయకులు భిన్నమైన ప్రకటనలు చేస్తుండటంతో తమకు చంద్రబాబు హెల్త్ బులిటెన్ కాపీ ఇవ్వాలని విజయవాడలోని ఎసిబి కోర్టులో పిటిషన్ దాఖలు అయ్యింది. సోమవారం చంద్రబాబు తరపున న్యాయవాదులు ఈ మేరకు ఎసిబి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. చంద్రబాబు ఆరోగ్యంపై కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణుల్లో సర్వత్రా ఆందోళన నెలకొన్న నేపథ్యంలో ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. చంద్రబాబు ఆరోగ్యంపై తమకు ఎలాంటి రిపోర్టు ఇవ్వటం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ చేపడతానని ఎసిబి కోర్టు న్యాయమూర్తి తెలిపారు.

మణిపూర్ కేసులో చార్జిషీట్ దాఖలు చేసిన సిబిఐ

న్యూఢిల్లీ : మణిపూర్ లైంగిక హింస కేసులో ఆరుగురు నిందితులపై సిబిఐ చార్జిషీట్ దాఖలు చేసింది. చట్టానికి విరుద్ధంగా ఒక చిన్నారిపై కూడా నివేదిక ఇచ్చింది. అస్సాం రాజధాని గువహటిలో ప్రత్యేక కోర్టులో చార్జిషీట్‌ను, నివేదికను సిబిఐ అందజేసింది. క్రిమినల్ కుట్ర, మారణాయుధాలతో అల్లర్లకు పాల్పడడం, మహిళలపై అత్యాచారం, సామూహిక అత్యాచారానికి పాల్పడడానికి సంబంధించి ఐపిసి నిబంధల కింద, ఎస్‌సి, ఎస్‌టి చట్ట నిబంధనల కింద సిబిఐ అభియోగాలు నమోదు చేసింది.

రాష్ట్ర ప్రభుత్వం నుండి అందిన ప్రస్తావన, కేంద్ర ప్రభుత్వ నోటిఫికేషన్‌లను పరిగణనలోకి తీసుకుని సిబిఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. మే 4న ఈ ఘటన జరగగా, జూన్ 21న కేసు నమోదైంది. మణిపూర్‌లోని కాంగ్‌పోక్పి జిల్లా ఫైనామ్ గ్రామంలోకి అత్యంత అధునాతన ఆయుధాలతో చొరబడ్డ దాదాపు వెయ్యి మంది మూక ఇళ్లను తగలబెట్టి, ఆస్తులను లూటీ చేసి, గ్రామస్తులపై దాడులు జరిపి, హత్యలు, అత్యాచారాలకు పాల్పడ్డారని చార్జిషీట్ పేర్కొంది.

జాలర్ల విడుదలకు చర్యలు తీసుకోండి

- కేంద్రానికి స్టాలిన్ విజ్ఞప్తి

చెన్నై : శ్రీలంక అరెస్టు చేసిన 27 మంది భారత జాలర్ల విడుదలకు దౌత్యపరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. జాలర్ల పడవల విడుదలకు కూడా సహాయం చేయాలని కోరారు. ఈ మేరకు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖకు స్టాలిన్ లేఖ రాసారు. తమిళ జాలర్లను శ్రీలంక అరెస్టు చేయడం, నిర్బంధించడాన్ని ఆయన ప్రస్తావించారు. ఇలాంటి సంఘటనలు తమిళనాడు తీరం వెంబడి ఉన్న జాలర్లలో భయాన్ని కలిగిస్తున్నాయని తెలిపారు. వీరి ఏకైక జీవనోపాధి ప్రమాదంలో పడిందని తెలిపారు. నిర్బంధంలో ఉన్న జాలర్ల విడుదలకు శ్రీలంక ప్రభుత్వంతో తక్షణమే దౌత్యపరమైన చర్యలు ప్రారంభించాలని కోరారు. ఈ నెల 14న రెండు వేర్వేరు ఘటనల్లో తమిళనాడుకు చెందిన మొత్తం 27 మంది జాలర్లను శ్రీలంక నేవీ అరెస్టు చేయడంతోపాటు వారి నాలుగు బోట్లను కూడా స్వాధీనం చేసుకుంది.

నిఠారీ సీరియల్ కిల్లింగ్స్ కేసు

- కోలి, పంథేర్‌ను నిర్దోషులుగా ప్రకటించిన అలహాబాద్ హైకోర్టు

ప్రయాగ్‌రాజ్ : నోయిడాలో నిఠారీ సీరియల్ కిల్లింగ్స్ కేసులో సరైన సాక్ష్యాధారాలు లేని కారణంగా సురేందర్ కోలి, మనీందర్ సింగ్ పంథేర్‌ను అలహాబాద్ హైకోర్టు సోమవారం నిర్దోషులుగా ప్రకటించింది. గతంలో వీరికి హత్య, అత్యాచారం ఆరోపణలతో ఉరిశిక్ష విధించారు. 2006 డిసెంబరు 29న నోయిడాలోని నిఠారీలో వ్యాపారవేత్త పంథేర్ ఇంటి ప్రాంగణంలో 19 మృతదేహాలు వెలుగుచూడటం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీనిపై 2007లో పంథేర్, ఆ ఇంటి పనివాడు కోలీపై 19 కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో 2017లో సిబిఐ ప్రత్యేక కోర్టు కోలి, పంథేర్‌కు మరణ శిక్ష విధించింది. దీనిపై ఇద్దరూ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు.

పాలస్తీనా ప్రజల హక్కులు కాపాడాలి

- అంతర్జాతీయ సమాజం ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తీసుకురావాలి
- పాలస్తీనాకు ఇండియా ఫోరం సంఘీభావం
- పాలస్తీనా అంబాసిడర్‌కు లేఖ అందజేత



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వామపక్షాలు, కాంగ్రెస్, జెడియు, ఎస్‌పి, బిఎస్‌పి తదితర అనేక రాజకీయ పార్టీల నేతలు సోమవారం న్యూఢిల్లీలో పాలస్తీనా రాయబారిని కలిసి పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలుపుతూ లేఖ ఇచ్చారు. 'హింస ఎప్పటికీ పరిష్కారం కాదని నమ్ముతున్నాము. అది విధ్వంసం, బాధలకు దారి తీస్తుంది. అందువల్ల ఘర్షణకు శాంతియుత పరిష్కారాన్ని తీసుకురావడంలో అంతర్జాతీయ సమాజం కృషిని పెంచాల్సిన అవసరాన్ని మేము నొక్కిచెప్పాము. అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి, పాలస్తీనా ప్రజల హక్కులు, గౌరవాన్ని గౌరవించేలా అంతర్జాతీయ సమాజం ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తీసుకురావాలి. ఈ ప్రాంతంలో శాశ్వత శాంతిని నిర్ధారించడానికి దౌత్యపరమైన ప్రయత్నాలు, బహుపాక్షిక కార్యక్రమాలను తీవ్రతరం చేయాలి' అని కోరారు.

'గాజాలో కొనసాగుతున్న సంక్షోభం, పాలస్తీనా ప్రజల బాధల గురించి మేము మా తీవ్ర ఆందోళనను వ్యక్తం చేస్తున్నాం. గాజాలో పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ విచక్షణారహితంగా బాంబు దాడి చేయడాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇది మారణహోమానికి ప్రయత్నమని మేము విశ్వసిస్తున్నాం. అమాయకుల ప్రాణనష్టం, ఇళ్లు, మౌలిక సదుపాయాల ధ్వంసం జరగకుండా నిరోధించడానికి అన్ని శత్రుత్వాలను తక్షణమే నిలిపివేయాలని మేము కోరుతున్నాము" అని పేర్కొన్నారు.

'గాజా ప్రజలకు అత్యవసరంగా, అడ్డంకులు లేకుండా మానవతా సహాయం అందించాలని మేము పిలుపునిస్తున్నాము. ఆహారం, నీరు, వైద్య సహాయంతో సహా అవసరమైన సామగ్రి ఎటువంటి ఆటంకం లేకుండా బాధిత ప్రజలకు చేరేలా అన్ని అవసరమైన చర్యలు తీసుకోవాలి' అని పేర్కొన్నారు.

'మహాత్మా గాంధీ మాటల్లో 'పాలస్తీనా అరబ్బులకు చెందినది. అదే అర్థంలో ఇంగ్లండ్ ఆంగ్లేయులకు, ఫ్రాన్స్ ఫ్రెంచ్ వారికి చెందినది' అని మేము గట్టిగా విశ్వసిస్తాము. ఇది పాలస్తీనియన్ల సార్వభౌమాధికారం. ప్రజలు, వారి మాతృభూమిపై ఇతర దేశాల హక్కు వలె, ప్రాదేశిక హక్కులను గుర్తించే ప్రాముఖ్యతపై దాని నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది. పాలస్తీనా ప్రజలు 75 ఏళ్లుగా అపరిమితమైన బాధలను అనుభవిస్తున్నారని గుర్తించి, వారి దుస్థితికి ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైందని మేము గట్టిగా చెబుతున్నాము. ఐక్యరాజ్యసమితి తీర్మానాలకు అనుగుణంగా 1967 సరిహద్దుల వెంబడి స్వతంత్ర పాలస్తీనా రాజ్య స్థాపనను గుర్తించాలని మేము అంతర్జాతీయ సమాజాన్ని కోరుతున్నాము. ఇటువంటి గుర్తింపు ఇజ్రాయిల్-పాలస్తీనా వివాదానికి న్యాయమైన, శాశ్వత పరిష్కారాన్ని నిర్ధారించడానికి కీలకమైన దశ. పాలస్తీనా ప్రజలకు వారి సొంత విధిని నిర్ణయించడానికి, శాంతి, భద్రతతో జీవించే అవకాశాన్ని అందిస్తుంది' అని పేర్కొన్నారు. లేఖపై సంతకం చేసిన వారిలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు నిలోత్పల్ బసు, సుభాషిణి అలీ, మాజీ మంత్రి మణిశంకర్ అయ్యర్, ఆర్‌జెడి ఎంపి మనోజ్ ఝా, సిపిఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా, మాజీ ఎంపి మహ్మద్ అఫ్జల్, జెడియు నేత కెసి త్యాగి, మాజీ మంత్రి జెనా శ్రీకాంత్, ఎస్‌పి ఎంపి జావేద్ అలీ ఖాన్, ముజఫర్ షా (జమ్ము కాశ్మీర్), మాజీ ఎంపి సంతోష్ భారతీయ, బిఎస్‌పి ఎంపి డానిష్ అలీ, మాజీ ఎంపిలు షాహిద్ సిద్ధిఖీ, మహ్మద్ అదీబ్, నదీమ్ ఖాన్ ఉన్నారు.



ఓటరు జాబితా సవరణలపై స్పష్టత ఇవ్వాలి

- ఇసికి సిపిఎం, సిపిఐ, ఎస్‌పి బృందం వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపు, సవరించే ప్రక్రియకు సంబంధించి స్పష్టత ఇవ్వాలని సిపిఎం, సిపిఐ, ఎస్‌పి డిమాండ్ చేశాయి. ఈ మేరకు సోమవారం కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనరుకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు నిలోత్పల్ బసు, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా, ఎస్‌పి ఎంపిలు రాంగోపాల్ యాదవ్, జావిద్ అలీఖాన్‌తో కూడిన నేతల బృందం వినతిని అందజేసింది. 2024 లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలు దృష్ట్యా 2023 జనవరి 6న, 2023 అక్టోబరు 27న ప్రచురించే ఓటరు జాబితాలతో పాటు ఓటరు జాబితాలో పేర్లు చేర్పులు, తొలగింపులు, సవరించడానికి సంబంధించి రాజకీయ పార్టీలకు అందజేసి, పేర్ల జాబితాపై స్పష్టత ఇవ్వాలని కోరారు. 'లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఉన్న శాసనసభ నియోజకవర్గాల్లోని ప్రతి బూత్ (పోలింగ్ స్థలం) ఓటరు జాబితాను రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని జిల్లా ఎన్నికల అధికారి / జిల్లా మేజిస్ట్రేట్ ప్రచురించారు. 2023 జనవరి 6 నుంచి 2023 అక్టోబరు 27 వరకు ఓటరు జాబితాలో పెద్ద సంఖ్యలో పేర్లు చేర్చారు. చాలా పేర్లు తొలగించారు. కొన్ని పేర్లు సవరించారు. తొలగించిన పేర్లను ఇంటింటికీ వెళ్లి ధ్రువీకరించడం చాలా ముఖ్యం, దీని కోసం తొలగించబడిన పేర్ల జాబితా డ్రాఫ్ట్ రోల్ / మదర్ రోల్, ఓటరు జాబితాలో చేర్చబడిన పేర్లతో పాటు రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉంచాలి.' అని పేర్కొన్నారు.

ఓటరు జాబితాలో చేర్చిన పేర్ల జాబితా, తొలగించిన పేర్ల జాబితా, సవరించిన పేర్ల జాబితాను రాజకీయ పార్టీలకు ఇవ్వొద్దని ఆదేశాలు ఇచ్చారని, ఇఆర్ఓ ముద్రించకూడదని నిబంధనలు, సూచనలు ఇచ్చారని, ఇది దారుణమని అన్నారు. 'లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎలాంటి రాజకీయ పార్టీల సమావేశం, చర్చలు లేకుండానే ఎలక్టోరల్ రోల్స్ 2023 మార్చిలో (పత్రం-10, ఎడిషన్-2) కేంద్ర ఎన్నికల సంఘం కొత్త మాన్యువల్‌ను విడుదల చేసింది. ఓటరు జాబితాలో చేర్చిన, సవరించిన, తొలగించిన పేర్లను మేము కోరుతున్నాము. అన్ని రాజకీయ పార్టీల పేర్లను చేర్చాలి. ఇది పార్టీలకు అందుబాటులో ఉంచాలి. లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలు-2024 స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించబడేలా పై సవరణలు, కొత్త నిబంధనలను రద్దు చేయాలి' అని కోరారు.

మోడీకి మణిపూర్ కంటే ఇజ్రాయిలే ఎక్కువ

- మిజోరం ఎన్నికల ప్రచారంలో రాహుల్

ఐజ్వాల్ : దేశంలో జరుగుతున్న మణిపూర్ హింసాకాండ కంటే ఇజ్రాయిల్‌లోని విషయాలే ప్రధానమంత్రి నరేంద్రమోడీకి ఎక్కువని కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ విమర్శించారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికల జరగనున్న మిజోరంలో ఎన్నికల ప్రచారంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. 40 అసెంబ్లీ స్థానాలు ఉన్న మిజోరంలో నవంబర్ 7న ఎన్నికలు జరగనున్నాయి. ఈ సందర్భంగా మిజోరం రాజధాని ఐజ్వాల్‌లో చన్మారీ నుంచి రాజ్ భవన్ వరకూ రాహుల్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ మే 3 నుంచి మణిపూర్‌లో హింసాకాండ జరుగుతున్నా.. మణిపూర్‌లో మోడీ పర్యటించలేదని విమర్శించారు. 'కొన్ని నెలల క్రితం నేను మణిపూర్‌కి వెళ్లాను. అక్కడ నేను చూసినదాన్ని నమ్మకలేకపోయాను. ప్రజల్ని హత్య చేశారు. మహిళల్ని వేధించారు. చివరికి శిశువుల్ని చంపారు. అయినా మన ప్రధానికి అక్కడకు వెళ్లడం ముఖ్యంకాదు' అని రాహుల్ విమర్శించారు. ప్రధాని అక్కడకు వెళ్లకపోవడం సిగ్గుపడాల్సిన విషయమని అన్నారు. మణిపూర్‌లో హింసాకాండ దేశంలోని వివిధ ప్రాంతాల్లో మైనార్టీలు, గిరిజనులు, దళితులు ఎదుర్కొంటున్న సమస్య యొక్క లక్షణం మాత్రమే అని అన్నారు. భారతదేశ ప్రజలను బిజెపి అణిచివేస్తోందని రాహుల్ ఆరోపించారు. 'మణిపూర్‌లో జరిగింది ప్రజలపై దాడి మాత్రమే కాదు.. ఇది మణిపూర్‌లోని భారతదేశం యొక్క ఆలోచనపై కూడా దాడి. ఈ దేశంలోని ప్రతీ మతాన్ని, సంస్కృతిని, భాషను, సంప్రదాయాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్క భారతీయుడి కర్తవ్యం' అని రాహుల్ స్పష్టం చేశారు. బిజెపితో పొత్తు పెట్టుకున్న మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్)పైనా రాహుల్ విమర్శలు గుప్పించారు. ప్రస్తుత ప్రభుత్వం గత ఐదేళ్లలో ఏమి చేసిందో పరిశీలించాలని ప్రజలకు రాహుల్ విజ్ఞప్తి చేశారు. యువత డ్రగ్స్ మత్తులో చిక్కుకుందని, మౌలిక సదుపాయాలు, రోడ్లు శిథిలావస్థలో ఉన్నాయని రాహుల్ విమర్శించారు.

టిడిపి 87 స్థానాల్లో పోటీ

- తెలంగాణలో బాలకృష్ణ ప్రచారం : కాసాని



మీడియాతో మాట్లాడుతున్న కాసాని జ్ఞానేశ్వర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి 87 స్థానాల్లో పోటీచేస్తుందని టిడిపి తెలంగాణ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ప్రకటించారు. ఇప్పటికే 30 మందితో జాబితా సిద్ధంగా ఉందన్నారు. పార్టీ అధినేత చంద్రబాబు ఆమోదం లభించగానే మ్యానిఫెస్టోతో పాటు అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామని తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ రాజమండ్రి సెంట్రల్ జైలులో చంద్రబాబును ములాఖాత్‌లో కలిశానని, రాష్ట్ర రాజకీయ పరిస్థితులను వివరించానని తెలిపారు. తెలంగాణలో టిడిపి బలంగా ఉందని, అసెంబ్లీ ఎన్నికల్లో తప్పకుండా పోటీచేస్తామని, జనసేనతో పొత్తు పెట్టుకోవాలా? లేదా? అనేది త్వరలో స్పష్టత వస్తుందని చెప్పారు. టిడిపి తరపున రాష్ట్రంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ ప్రచారం చేస్తారని వివరించారు. చంద్రబాబు మంగళవారం బయటకు వస్తారని భావిస్తున్నట్టు చెప్పారు. ఆయన ఆరోగ్యంపై దేశవ్యాప్తంగా ఆందోళన నెలకొందన్నారు. ఎపి జగన్ అక్రమాలపై పోరాటం కొనసాగుతుందన్నారు. ఇతర పార్టీల నుంచి టిడిపిలో చేరేందుకు చాలా మంది సంప్రదిస్తున్నారని, కాంగ్రెస్ కంటే రాష్ట్రంలో టిడిపినే బలంగా ఉందని చెప్పారు. చంద్రబాబు నాయకత్వంలో బిసిలకు పెద్దపీట వేస్తామని ప్రకటించారు. అభ్యర్థులు పోటీచేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గ్రేటర్‌లో కాకుండా తెలంగాణ జిల్లాల్లో బాలకృష్ణ ప్రచారం చేస్తారని చెప్పారు. టిడిపి మేనిఫెస్టో అందరికీ ఆదర్శంగా ఉంటుందన్నారు. విలేకర్ల సమావేశంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా వాసిరెడ్డి రామనాథం, ప్రధాన కార్యదర్శులు జక్కలి ఐలయ్యయాదవ్, అజ్మీరా రాజునాయక్, తెలుగు మహిళ అధ్యక్షురాలు భవనం షకీలారెడ్డి పాల్గొన్నారు.

గాజా ఉక్కిరిబిక్కిరి

- 24గంటల్లో నీరు, విద్యుత్ నిల్వలు ఖాళీ
- ఆస్పత్రుల్లో పరిస్థితులు దయనీయం
- పొంచివున్న ఇన్ఫెక్షన్లు, అంటువ్యాధులు
- సాయం కోసం ప్రజల ఎదురుతెన్నులు
- రాఫా క్రాసింగ్ వద్ద పడివున్న ఆహార నిల్వలు
- ఒప్పందం కోసం ముమ్మరంగా దౌత్య ప్రయత్నాలు

జెరూసలేం, గాజా : హమాస్ ఆధీనంలో వున్న గాజాపై ఇజ్రాయిల్ బాంబు దాడులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మరోవైపు నీరు, విద్యుత్ నిల్వలు తరిగిపోతుండడంతో గాజా ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. సాయం కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. పలు దేశాల నుండి వచ్చిన వందలాది మెట్రిక్ టన్నుల ఆహారం, ఇతర సాయం ఈజిప్ట్‌లోని సినాయ్ ద్వీపకల్పంలో రోజుల తరబడి నిలిచిపోయింది. బాంబుల మోత మోగుతున్న గాజాకు సురక్షితంగా చేరవేయడం పెద్ద సాహసకృత్యంగా మారింది. గాజాకు సాయం అందించడం, విదేశీ పాస్‌పోర్టు గల వారందరినీ రాఫా క్రాసింగ్ ద్వారా తరలించడానికి ఒప్పందం కుదిరేవరకు ఈ సాయం ఆగిపోయింది. బాధితులకు సాయమందించడం కోసం దౌత్య ప్రయత్నాలు ఉధృతమయ్యాయి. ఈ తరుణంలో గాజాతో గల సరిహద్దును ఈజిప్ట్ తెరుస్తుందని భావిస్తున్నారు. ప్రాణాధారమైన సాయం రాఫా క్రాసింగ్ వద్ద ఎదురుచూస్తోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) పేర్కొంది. వైద్య సరఫరాలు, ఇంధనం, పరిశుభ్రమైన నీరు, ఆహారం, ఇతర మానవతా సాయాన్ని రాఫా క్రాసింగ్ ద్వారా గాజాకు వెళ్లేందుకు అనుమతించాలంటూ డబ్ల్యుహెచ్ఓ ఇప్పటికే పలు విజ్ఞప్తులు చేసింది. మరోవైపు గాజావ్యాప్తంగా అస్పత్రిల్లో ఇంధన నిల్వలు తరిగిపోతున్నాయి. మరో 24గంటలు మాత్రమే వస్తాయని భావిస్తున్నారు. దీంతో వేలాదిమంది రోగుల ప్రాణాలు ముప్పు బారిన పడనున్నాయని ఐక్యరాజ్య సమితి మానవతా కార్యకలాపాల కార్యాలయం (ఒసిహెచ్ఎ) సోమవారం తెలిపింది. గాజాలో పరిమిత నీటి నిల్వలు మాత్రమే వుండడం పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. అలాగే పారిశుధ్యం కూడా దారుణంగా వుందని, ముఖ్యంగా ఆస్పత్రుల్లో పరిస్థితి ఘోరంగా వుందని, దీనివల్ల ఇన్ఫెక్షన్లు, వ్యాధులు చెలరేగే ప్రమాదముందని ఆందోళన వెలిబుచ్చింది. ఆరోగ్య సంక్షోభం తలెత్తిన పక్షంలో వెంటనే స్పందించేందుకు వీలుగా లెబనాన్‌కు కీలకమైన వైద్య సరఫరాలను పంపించడాన్ని వేగిరపరిచినట్లు తెలిపింది. 'నీరు, విద్యుత్ లేక గాజా ఉక్కిరిబిక్కిరి అవుతోంది, ప్రస్తుత తరుణంలో ప్రపంచం తన మావనత్వాన్ని మరిచిపోయినట్లు కనిపిస్తోంది.' అని ఐక్యరాజ్య సమితిలో పాలస్తీనా శరణార్థుల కమిషనర్ (యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ) జనరల్ ఫిలిప్ లాజారిని వ్యాఖ్యానించారు.

వైమానిక దాడుల వల్ల రాఫా క్రాసింగ్‌ను మూసివేశారు. ఒప్పందానికి అమెరికా మధ్యవర్తిత్వం నెరపడం కోసం ప్రయత్నిస్తోంది. ఇప్పటివరకు ఇజ్రాయిల్ దాడుల్లో గాజాలో 2,670మంది చనిపోయారని అధికారులు తెలిపారు. వీరిలో నాల్గోవంతు మంది చిన్నారులే, మరో 10వేల మంది గాయపడ్డారు. ఇంకో వెయ్యిమంది గల్లంతయ్యారు. వీరు శిథిలాల కింద చిక్కుకుని వుంటారని భయపడుతున్నారు.



గాజాలోని డీర్ ఎల్-బలాహ్ ప్రాంతంలో ఒక ఆసుపత్రి వెలుపల ఇజ్రాయిల్ వైమానిక దాడిలో మరణించిన వారి మృతదేహాలను ఒక వ్యాన్‌లో తీసుకుని వెలుతున్న దృశ్యం.

కాల్పుల విరమణ లేదు

రాఫా సరిహద్దు క్రాసింగ్‌కు అనుమతించేందుకు గాజాలో కాల్పుల విరమణ జరిగిందని వచ్చిన వార్తలను ఇజ్రాయిల్ తోసిపుచ్చింది. ఈ మేరకు ప్రధాని బెంజామిన్ నెతన్యాహు కార్యాలయం ఒక ప్రకటన చేస్తూ, 'గాజాకు సాయమందేందుకు, విదేశీయులను తరలించేందుకు ప్రస్తుత తరుణంలో ఎలాంటి కాల్పుల విరమణ లేదు' అని స్పష్టం చేసింది. అంతకుముందు రాఫా తెరిచేందుకు ఒప్పందం కుదిరిందంటూ ఈజిప్ట్ భద్రతా వర్గాలు తెలిపాయని వార్తలు వెలువడ్డాయి.

దక్షిణ గాజాలో కాల్పుల విరమణకు ఈజిప్ట్, అమెరికా, ఇజ్రాయిల్ అంగీకరించాయని ఆ వార్తలు తెలిపాయి. పలు గంటల పాటు ఈ కాల్పుల విరమణ వుండవచ్చని, కానీ కచ్చితంగా ఎప్పుడు ప్రారంభమయ్యేది తెలియదని పేర్కొన్నాయి.

హమాస్ చెరలో 199 మంది బందీలు

హమాస్ అదుపులోకి తీసుకున్న వారు 199మంది వున్నారని ఇజ్రాయిల్ మిలటరీ సోమవారం స్పష్టం చేసింది. ఆ 199 బందీల కుటుంబాలకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేస్తున్నామని సైనిక ప్రతినిధి డేనియల్ హగారి మీడియాకు తెలిపారు. అంతకుముందు 155 మంది బందీలని ప్రకటించింది. ఇజ్రాయిలీలతోపాటూ విదేశీయులు కూడా బందీల్లో వున్నారు. తక్షణమే బందీలను విడిచిపెట్టి గాజాకు మానవతా సాయాన్ని అందేలా చూడాల్సిందిగా యుఎన్ చీఫ్ విజ్ఞప్తి చేశారు. అరబ్ లీగ్ చీఫ్ కూడా ఇదే విజ్ఞప్తి చేశారు.



సంకెళ్లు వేసిన చీకటి కాలం

- పత్రికా స్వేచ్ఛను కాపాడేందుకు రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి
- వివిధ సంఘాలు సంయుక్తంగా లేఖ
- న్యూస్‌క్లిక్‌పై దాడికి నిరసనగా పిసిఐలో ధర్నా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో పత్రికా స్వేచ్ఛను కాపాడేందుకు, జర్నలిస్టులు నిర్భయంగా పనిచేసేందుకు, జీవించే పరిస్థితులను కల్పించేందుకు జోక్యం చేసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్మును వివిధ సంఘాలు సంయుక్తంగా అభ్యర్థించాయి. 'ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభానికి సంకెళ్లు వేసిన చీకటి కాలం దేశంలో నెలకొంది. రహస్యంగా ఇప్పుడు అదే పరిస్థితి అనుభవిస్తున్నారు. జర్నలిస్టులకు వ్యతిరేకంగా క్రూరమైన చట్టాలు ఎక్కువగా ఉపయోగించబడుతున్నాయి. వారిలో ఎక్కువ మంది ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్నారు' అని లేఖలో పేర్కొన్నాయి. 'ఇటీవల ఇలాంటి కేసుల్లో జర్నలిస్టుల ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, హార్డ్ డ్రైవ్‌లు స్వాధీనం చేసుకున్నారు. జర్నలిస్టులకు నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద జైలుశిక్ష విధిస్తున్నారు. ప్రజాస్వామ్యం మనుగడకు, పురోగమనానికి స్వేచ్ఛా మీడియా అవసరం. దేశంలోని అత్యున్నత రాజ్యాంగ హోదా కలిగి ఉన్న రాష్ట్రపతి పత్రికా స్వేచ్ఛను కాపాడేందుకు జోక్యం చేసుకోవాలి' అని కోరారు. సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు న్యూఢిల్లీ ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఉమెన్స్ ప్రెస్ కార్ప్, ప్రెస్ అసోసియేషన్, ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్, కెయుడబ్ల్యుజె, డిజిపబ్, ఫారిన్ కరస్పాండెంట్స్ క్లబ్, వెటరన్ జర్నలిస్ట్ గ్రూప్, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్లు సంయుక్తంగా లేఖ రాశాయి. న్యూస్‌క్లిక్‌పై కేంద్ర ప్రభుత్వ దాడికి నిరసనగా ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియా (పిసిఐ) నిరసన సభ, ధర్నా నిర్వహించింది. ప్లకార్డులు చేబూని నిరసన హోరెత్తించారు. సీనియర్ జర్నలిస్టులు ప్రేమశంకర్ ఝా, సతీష్ జాకబ్, నీనా వ్యాస్, సుజాత మధోక్, ఎంకె వేణు, పరంజోయ్ ఠాకుర్తా, కెయుడబ్ల్యుజె ఢిల్లీ యూనిట్ కార్యదర్శి ధనసుమోద్ మాట్లాడారు.

మహిళా బిల్లును తక్షణమే ఆమోదించాలి

- సుప్రీంకోర్టులో పిటిషన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటులో ఇటీవల ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. వచ్చే ఏడాదిలో జరిగే సార్వత్రిక ఎన్నికలకు ముందే వీటిని అమలు చేయాలని పిటిషన్‌లో కోరారు. పార్లమెంటు ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తెలపడంతో ఇటీవలే అది చట్టరూపం దాల్చిన విషయం తెలిసిందే. అయినప్పటికీ ఈ చట్టం ప్రస్తుతం అమల్లోకి వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. జనగణన, డీలిమిటేషన్ తరువాత ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకురానున్నట్లు బిల్లుపై చర్చ సందర్భంగా ప్రధాని మోడీ లోక్‌సభకు తెలిపారు. ఇలా ఈ చట్టం అమలు ఆలస్యమవుతుండటంపై కాంగ్రెస్ నేత జయ ఠాకూర్ సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. చట్టం అమలుకు ఉన్న అడ్డంకులను చెల్లనివిగా ప్రకటించి తక్షణమే ఈ రిజర్వేషన్లను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ కూడా డిమాండ్ చేశారు. ఈ దిశగా ప్రతిపక్ష ఇండియా కూటమి పార్టీలు ఐక్య పోరాటం చేస్తాయని ప్రకటించారు. చెన్నైలో డిఎంకె మహిళా విభాగం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన 'మహిళా హక్కుల మహానాడు' సదస్సులో ఆమె ఈ విషయాన్ని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో విద్యుత్ కోతలు లేవు

- ఇంధనశాఖ మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎలాంటి విద్యుత్ కోతలు లేవని ఇంధనశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెల్లడించారు. ఇంధనశాఖ అధికారులతో విద్యుదుత్పత్తి, వినియోగంపై సచివాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఆశించిన మేరకు హైడల్, సోలార్ ప్లాంట్ల విద్యుదుత్పత్తి కావడం లేదని మంత్రి అన్నారు. బయటి నుంచి విద్యుత్ కొనుగోళ్లు చేస్తూ ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. గత వేసవి సీజన్‌లో ఉన్న వినియోగానికి మించి రాష్ట్రంలో విద్యుత్ వినియోగం జరుగుతుందన్నారు. వ్యవసాయ, గృహవసరాలు, పరిశ్రమలకు ఎక్కడా ఇబ్బంది లేకుండా సమర్ధవంతంగా సరఫరా చేస్తున్నామని తెలిపారు. అయినప్పటికీ టిడిపి రాజకీయం కోసం విద్యుత్ కోతలు ఉన్నాయంటూ సబ్‌స్టేషన్ల వద్ద అల్లరి చేస్తోందని మంత్రి పెద్దిరెడ్డి విమర్శించారు. థర్మల్ ఉత్పత్తి కేంద్రాల నుంచి విద్యుదుత్పత్తిని పెంచుకుంటున్నామని వివరించారు. అవసరమైన చోట్ల అదనంగా బొగ్గు నిల్వలను అందుబాటులోకి ఉంచుతున్నామని, విదేశాల నుంచి బొగ్గు దిగుమతుల కోసం పూర్తిస్థాయిలో అధికార యంత్రాంగాన్ని ఉంచామన్నారు. విద్యుత్ కోతలు అంటూ తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్నారని, ఇటువంటి వాటిని ప్రజలు నమ్మొద్దని కోరారు. ఈ సమావేశంలో ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, కాలుష్య నియంత్రణ మండలి కార్యదర్శి బి శ్రీధర్, జెన్‌కో ఎండి కెవిఎన్ చక్రధరబాబు, ఇంధనశాఖ డిప్యూటీ సెక్రటరీ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికాగోలో ముస్లిం బాలుడి హత్య

- ఇంటి యజమాని ఘాతుకం

చికాగో : ఇజ్రాయిల్-హమాస్ యుద్ధానికి ప్రతిస్పందనగా ఆరేళ్ల బాలుడిని పొడిచి చంపి, 32 ఏళ్ల మరో మహిళను తీవ్రంగా గాయపరిచిన వారి ఇంటి యజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. "బాధితులు కేవలం ముస్లింలైనందుకే వారిని లక్ష్యంగా చేసుకున్నట్లు" పోలీసులు నిర్ధారించారని విల్ కౌంటీ షరీఫ్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. చికాగో శివారు ప్రాంతానికి చెందిన ఇంటి యజమాని, 71ఏళ్ల వ్యక్తి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. పెద్ద మిలటరీ స్టైల్ కత్తితో బాలుడిని 26 సార్లు పొడిచాడని పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది. గాయపడిన మహిళ శరీరంపై 12కిపైగా కత్తిపోట్లు వున్నాయి. ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. శనివారం మధ్యాహ్నం వారిద్దరు ఇంట్లో పడివుండగా కనుగొన్నారు. నేరం చేసిన ఆ వృద్ధుడు ఆ ఇంటికి కాస్త దూరంలో కూర్చునివున్నాడని, నుదుటిపై గాయం కూడా వుందని పోలీసులు తెలిపారు. ఆ వృద్ధుడిపై ఫస్ట్ డిగ్రీ మర్డర్ అభియోగం, హత్యా ప్రయత్నం, విద్వేష నేరాలు వంటి అభియోగాలు మోపారు. అధికారులు మృతుడి పేరు వెల్లడించలేదు. బాధితుల కుటుంబం పత్రికా సమావేశంలో ఆ పాలస్తీనియన్ అమెరికన్ బాలుడి పేరు వెల్లడించింది.

పశ్చిమాసియా సంక్షోభంపై సర్వత్రా ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

గురించి టర్కీ అధ్యక్షుడు తైయిప్ ఎర్డోగన్, ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసి ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ మేరకు టర్కీ అధ్యక్ష కార్యాలయం ఎక్స్‌లో పోస్ట్ చేసింది. రాబోయే రోజుల్లో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఇజ్రాయిల్‌లో పర్యటించాలని భావిస్తున్నారు. గాజాను మరోసారి ఆక్రమించుకోవడానికి ప్రయత్నించవద్దంటూ అధ్యక్షుడు బైడెన్ ఆదివారం ఒక ఇంటర్వ్యూలో బహిరంగంగానే ఇజ్రాయిల్‌ను హెచ్చరించారు.

ఫిలిప్పీన్స్‌లో వేలాదిమంది నిరసనలు

పాలస్తీనాకు అనుకూలంగా దక్షిణ ఫిలిప్పీన్స్‌లో వేలాదిమంది నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. పాలస్తీనా పతాకాలు చేబూని పాలస్తీనా జాతీయ పతాక రంగులను వారి ముఖాలకు పూసుకుని ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఇజ్రాయిల్ చర్యలను ఖండిస్తూ కొటాబెటొ సిటీ పబ్లిక్ పార్క్ వద్ద నాలుగు గంటల పాటు బహిరంగ సభ జరిగింది. 25వేల మందికిపైగా పాల్గొన్నారని పోలీసు వర్గాలు తెలిపాయి. తక్షణమే ఇజ్రాయిల్ సైన్యం హింసాకాండను ఆపాలని సభలో మాట్లాడిన వక్తలు కోరారు. ఈ ఘర్షణల్లో అమెరికా, ఐక్యరాజ్య సమితి రెండూ తటస్థ వైఖరి పాటించాలని విజ్ఞప్తి చేశారు.

జంతర్ మంతర్ వద్ద నిరసన

పాలస్తీనియన్లకు మద్దతుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సోమవారం నిరసన ప్రదర్శన జరిగింది. వామపక్ష విద్యార్థి సంఘాలతో సహా పలు సంస్థలు ఇచ్చిన పిలుపు మేరకు ఈ ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనకు అనుమతి లేదని పోలీసులు చెప్పారు. దాదాపు 50మందిని అదుపులోకి తీసుకున్నారు. భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



మీకోసం

దోరగా వేయించిన వాముని ఒక పలుచటి వస్త్రంలో మూటకట్టి పిల్లల ఛాతీపై మృదువుగా కాపడం పెడితే ఆయాసం తగ్గి, ఊపిరి తేలికగా తీసుకోగలుగుతారు.

జీవన సౌరభం

స్వీకరించిన ఆదర్శాన్ని ఆచరించే ప్రయత్నంలో వేయిసార్లు విఫలమైనా మరొకసారి ప్రయత్నించండి.

పుట్టినరోజు వేడుకలు



రవి తన పుట్టినరోజు వేడుకకు కొంత మంది మిత్రులను, కథల తాతయ్యను పిలిచాడు. సాయంత్రం ఆరు గంటలకల్లా స్నేహితులంతా వచ్చారు. కాసేపటి తరువాత కథల తాతయ్య వచ్చారు. ఆయనకు రవి తల్లిదండ్రులు స్వాగతం పలికారు. అసలు ఆయన పేరు సూర్యం మాస్టారు. ఖాళీ సమయం దొరికితే పిల్లలంతా ఆయన వద్దకు చేరేవారు. మాస్టారు మంచి నీతి కథలను చెప్పి, ఆ కథలను నోట్ బుక్‌లో రాయమనే వారు. అలా చేయడం వల్ల తెలుగు భాష మీద సులువుగా పట్టు వస్తుందని చెప్పేవారు.

పుట్టినరోజు కోసం వచ్చిన అతిథులకు, స్నేహితులకు భోజనాలు ఏర్పాటు చేశారు రవి నాన్న. రవి స్నేహితులు అతనికి బహుమతులు ఇచ్చారు. కథల తాతయ్య కొన్ని నీతి కథల పుస్తకాలను ఇచ్చి రవిని ఆశీర్వదించారు. 'రవి నీతో పాటు నీ మిత్రులు కూడా ఈ పుస్తకాలను చదివేలా చేయాలి' అన్నారు. 'అలాగే తాతయ్య!' అన్నాడు రవి.

'పిల్లలూ కాసేపట్లో భోజన కార్యక్రమం మొదలవుతుంది మీరంతా శ్రద్ధగా వినండి అన్నం ఎంతో విలువైంది. వృధా కానివ్వకండి. తక్కువ వడ్డించుకుని తృప్తిగా తినండి. మీరు తినగా మిగిలిన పదార్థాలను ఎవరికైనా పంచండి. నేను వస్తున్నప్పుడు ఇక్కడికి దగ్గరగా ఓ పెద్ద భవంతి కడుతున్నారు. అక్కడ పనివాళ్లతో పాటు వాళ్ల పిల్లలు కూడా ఉన్నారు. ఇక్కడ మిగిలిపోయిన ఆహారం వారికి తీసుకెళ్లి పెట్టండి. సంతోషిస్తారు' అని చెప్పారు తాతయ్య. 'సరే తాతయ్య..' అంటూ పిల్లలు భోజనకార్యక్రమం పూర్తిచేశారు.


పాతిక మందికి అని తెచ్చిన భోజనాలు మరో పదిహేనుమందికి సరిపడా మిగిలాయి. 'తాతయ్యా! ఈ పదార్థాలు ఉన్న గిన్నెలను తీసుకు వెళ్లి వారికి ఇచ్చే కంటే వారినే ఇక్కడకు రమ్మంటే బాగుంటుంది కదా?' అన్నాడు రవి. 'చాలా బాగుంటుంది. అలాగే వెళ్లి పిలుచుకొద్దాం పద!' అన్నారు తాతయ్య. ఆ పిల్లలు వచ్చి చక్కగా తిని రవికి పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పి వెళ్లారు. ఇదంతా చూసిన రవి స్నేహితులు, 'తాతయ్య! మా పుట్టిన రోజు వేడుకలను కూడా ఇదే పద్ధతిలో చేసుకుంటాం' అన్నారు. 'చాలా సంతోషం పిల్లలూ.. భోజనాలు వృధా కాకుండా మీరు ఎప్పుడూ ఇలాగే చేయండి.. సరేనా' అన్నారు కథల తాతయ్య.

- యు.విజయశేఖర రెడ్డి,
99597 36475

నేను గీసిన బొమ్మ



ఎస్.కె.మహ్విన్,
8వ తరగతి,
అరవింద హైస్కూలు,
కుంచనపల్లి.



9	+	3	=	
+		−		+
6	−		=	4
=		=		=
	+	1	=	16

లెక్క చేయండి

పిల్లలూ, ఇక్కడ బాక్సులో ఇచ్చిన అంకెలతో సరైన సమాధానాలు రాబట్టండి చూద్దాం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వృద్ధాప్యంలోనూ... సరదాగా చలాకీగా



ప్రతి ఇంట్లోనూ తల్లిదండ్రులు..నానమ్మ-తాతయ్య..అమ్మమ్మ-తాతయ్య ఇలా దాదాపుగా వృద్ధాప్యంలో ఉన్న వారు తప్పక ఉంటారు. ప్రతి ఒక్కరూ జీవితంలో ఏదో ఒక పనిచేస్తుంటారు. వయస్సు పెరిగాక వృద్ధులుగా మారుతుంటారు. అయితే 68 సంవత్సరాలు దాటిన వారు కూడా ఉత్సాహంగా ఉంటూ తమ పని చేసుకుంటూ ఇంట్లో మిగతా వారిని ఇబ్బంది పెట్టకుండా ఉండేవారు సైతం ఉంటారు. మరికొందరికి వయస్సు మీదపడ్డప్పుడు జరిగే మార్పులను తట్టుకోలేరు. అలాంటి వారికి ఇంట్లో మిగతా సభ్యుల నుంచి సహకారం, సంరక్షణ అవసరం ఉంటుంది. డయాబెటీస్, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి వ్యాధులు సైతం ఉన్న వారు సైతం తమ ఆహార అలవాట్లను క్రమం తప్పకుండా పాటించటం, సంతోషంగా ఉండటం, వ్యాయామం చేయటం, ఇష్టమైన సంగీతం వినడం, డ్యాన్సులు చేయటం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందుతున్న వారు కూడా సమాజంలో ఉన్నారు. కేరళ రాష్ట్రంలోని త్రిశూర్ ప్రాంతంలో సుమిత్ర (ఎన్‌జిఒ) '60 ప్లస్ మ్యూజిక్ క్లబ్' వృద్ధుల్లో ఉత్సాహాన్ని నింపటానికి నిరంతరం కృషిచేస్తోంది. వారిలో ఉన్న సృజనాత్మక శక్తులకు సరికొత్తగా మెరుగులు అద్దటానికి క్లబ్ సభ్యులు ప్రోత్సహిస్తున్నారు.

సాధారణంగా వృద్ధులంటే సమాజంలో ఒకచులకన భావం ఉంటుంది. ఇన్నాళ్లు కష్టపడ్డారుగా... ఈ వయస్సులో మీకు ఇంకా పనులు చేయటం అవసరమా?...ఇక విశ్రాంతి తీసుకోండి..బయట విషయాలు మీకెందుకు అన్న చందంగా కుటుంబ సభ్యుల మాటల్లో వ్యక్తమవుతూ ఉంటుంది. ఇలాంటి మాటలోని అంతరార్థం తెలుసుకుంటున్న పెద్దోళ్లు లోలోపల కుమిలిపోవటం కూడా సమాజంలో నిత్యం చూస్తున్న సంఘటనలే. వృద్ధాప్యంలో ఉన్న కొందరు మిత్ర సమూహంగా ఏర్పాటై 'సుమిత్ర' ద్వారా ఈ క్లబ్‌ను ఏర్పాటుచేశారు. తమ ఆధ్వర్యంలో ప్రభుత్వేర సంస్థగా (ఎన్‌జిఒ)గా 2018లో '60-ప్లస్ మ్యూజిక్ క్లబ్'ను కేరళలోని త్రిశూర్ ప్రాంతంలోని అరింపూర్ పంచాయతీ పరిధిలో ఏర్పాటుచేశారు. కేవలం ఇది వృద్ధుల కోసమే పనిచేస్తుంది. మొదట్లో తక్కువమందితో ప్రారంభమైన ఈ క్లబ్‌లో వృద్ధులైన పురుషులు, మహిళలు ఇందులో సభ్యులుగా



చేరటం ప్రారంభించారు. మొదట్లో పాకలో ప్రారంభమైన ఈ క్లబ్ అనతికాలంలోనే పంచాయతీ పాలకవర్గ సహకారంతో చిన్నపాటి సముదాయం ఏర్పడటంతో వృద్ధుల విశేష ప్రతిభా పాటలవాల ప్రదర్శనా కేంద్రంగా మారింది. ఈ క్లబ్‌కు హాజరయ్యేవారు కుల,మత, ప్రాంతం వంటి ఎలాంటి బేధాలు లేకుండా తమకు వచ్చిన కళలను ప్రదర్శించొచ్చు.

ఆటలు, పాటలు, నృత్యాలు, వినోదం వంటివి ఏవైనా ప్రదర్శించొచ్చు. అయితే అవి ఎవరికీ ఇబ్బంది లేకుండా ఉండాలి. అలా ఉంటేనే ప్రదర్శనకు అంగీకరిస్తారు. మంచి క్లాసికల్ డ్యాన్సుల నుంచి లేటెస్ట్ పాటల వరకూ పాడొచ్చు. ఆడొచ్చు...పాడొచ్చు...నృత్యాలు చేయొచ్చు. తద్వారా ప్రతిఒక్కరూ కూడా ఇక్కడికి వచ్చిన వారు తమ ప్రతిభకు పదును పెడుతుంటారు. తమలో ఉన్న ఎలాంటి కళలైనా ఎలాంటి జంకు, బిడియం, అభద్రత వంటి వాటికి ఇక్కడ చోటుండదు.

ఆడండి..పాడండి..ఆరోగ్యంగా ఉండండి అంటూ అవకాశం దొరికినప్పుడల్లా క్లబ్ సభ్యులు మైకుల ద్వారా ప్రోత్సహిస్తుంటారు. సుమతితో ఆమె స్నేహితులు కూడా ఇక్కడికి ఎక్కువమంది వస్తుంటారు. సుమతి తన జీవితంలో ఎక్కువ భాగాన్ని ముంబైలో గడిపారు. ప్రస్తుతం ఆమెకు 72 సంవత్సరాలు. పాత హిందీ సినిమా పాటలను ఆమె బాగా ఇష్టపడతారు. తనవంతుగా ప్రతిరోజూ రెండు, మూడు అలాంటి హిందీ పాటలను ఆలపిస్తారు. అంతటితో ఆగకుండా మిగతా వారితో కలిసి డ్యాన్సుల్లో తనవంతుగా స్టెప్పులు సైతం వేస్తారు. స్వతహాగా ఆమె గాయకురాలు. ఆరోజుల్లో ఎవర్‌గ్రీన్ మెలోడీలు ఆలపించే గాయకుల్లో ఆమె కూడా ఒకరు. మిగతావారు ఆడుతున్నా, పాడుతున్నా ఆమె స్వతహాగా ముందుకొచ్చి పాడుతూ చిందులేస్తూ మిగతావారిలో ఉత్సాహాన్ని నింపుతుంటారు.

స్నేహమేరా జీవితం...

ఇక్కడికి వచ్చే వారంతా వృద్ధులైనా ఎంతో సంతోషంగా ఉంటారు. ప్రతిఒక్కరూ తమలో ఉండే ఆత్మన్యూనతాభావాన్ని అనతికాలంలోనే తొలగించుకుంటారు. ఎలాంటి భావప్రకటనకైనా స్వేచ్ఛ ఉండటంతో ప్రశాంతవాతావరణంలో ఉంటారు. అంతా నవ్వుతూ కేరింతలు కొడుతూ ఆటపాటల్లో మునిగి తేలుతుంటారు. తమకు తెలిసిన, తోచిన, మదిలే మెదిలో ఎలాంటి ఊహలు, ఆలోచనలు, భయాలు, ఆందోళనలు వంటిపై భయంలేకుండా చెప్పేసుకునే అవకాశాలు ఉన్నాయి. నిషేధాజ్ఞలు లేవు. స్టేజ్ భయాలు ఉండబోవు. లీలా, మణిలు అనారోగ్య సమస్యలు ఉన్నా, శ్వాస తీసుకోవటంలో ఇబ్బందులున్నా కూడా తమవంతుగా కూడా నృత్యాలు చేయటానికి ముందుకొచ్చారు. మరికొందరు తమ వయస్సును పక్కన పెట్టేసి ఆటల్లోనూ, పాటల్లోనూ, నృత్యాల్లోనూ జతకలుస్తుంటారు. ఎవరికీ ఏ విధమైన బేధాభిప్రాయాలు ఉండబోవు. తన కార్యకలాపాల ద్వారా, సీనియర్ సిటిజన్లు తరచూ సమావేశాలు అయ్యేలా క్లబ్ కీలకపాత్ర పోషిస్తుంది. అలాగా వారి సమస్యలను పంచాయతీ అధికారుల దృష్టికి క్లబ్ ప్రతినిధులు తీసుకెళ్లి పరిష్కరిస్తుంటారు. కరోనా మహమ్మారి కాలంలో లాక్‌డౌన్ సమయంలో పంచాయతీ సహకారంతో ఈ క్లబ్ ద్వారా కరోనా బాధితులకు కౌన్సిలింగ్‌లు, ఆన్‌లైన్ ద్వారా అవగాహనా కార్యక్రమాలు కూడా జరిగాయి.

హెల్ప్‌లైన్‌కు పంచాయతీ సహకారం

60-ప్లస్ మ్యూజిక్ క్లబ్'ను 'వయోజన హెల్ప్‌లైన్‌ను సైతం ఏర్పాటుచేశారు. దీనికింద వాలంటీర్ల నెట్‌వర్క్ సహాయానికి అవసరమయ్యే వృద్ధులు, వికలాంగులను ఆహ్వానిస్తుంటారు. పంచాయతీ పాలకవర్గం కూడా తమ పంచాయతీ వార్షిక ప్రణాళికలో వయోజన హెల్ప్‌లైన్‌కు స్పందించాలనీ, సమస్యలను పరిష్కరించటానికి పూనుకోవాలని నిర్ణయించింది. కుటుంబశ్రీ వృద్ధుల డేకేర్ కోసం 'పాకలవీడు' వంటి స్థలం కోసం తాము వెతకటం లేదని సుమిత్ర సహ వ్యవస్థాపకుడు బికె మణి అన్నారు. 'మాకు అవకాశం దొరికినప్పుడల్లా ఈ క్లబ్‌కు హాజరై కొంత సమయాన్ని ఆనందంగా గడిపేస్తున్నాం. ఇది మాది జీవితంలో సంతోషాన్ని నింపుతుంది. తరచుగా ఇంట్లో ఒంటరిగా ఉండటం వల్లే కలిగే ఒత్తిడి నుంచి క్లబ్‌లో జరిగే 'సమావేశాలు...ఒత్తిడిని జయించే విషయాలు..ఒత్తిడి నుంచి అపారమైన ఉపశమనాన్ని అందిస్తున్నాయి' అని ఆమె పేర్కొన్నారు.

డాలర్ వద్దు.. యెన్‌కు మార్చండి

రుణాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలకు విదేశీ సంస్థల ద్వారా తీసుకునే రుణాలపై వడ్డీ భారాన్ని తగ్గించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. వివిధ దేశాల నుంచి తీసుకుంటున్న ఈ రుణాలను ఒకే దేశ కరెన్సీ కిందకు మార్చాలని గతంలోనే కేంద్ర ప్రభుత్వాన్ని, రిజర్వు బ్యాంకును కోరిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రుణాలను అమెరికన్ డాలర్‌కు బదులుగా జపాన్ యెన్‌లలోకి మార్చాలని కోరింది. దీని వల్ల వడ్డీ భారం గణనీయంగా తగ్గుతుందని అధికారులు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న రుణాల్లో ఎక్కువగా యూరో కరెన్సీ, జపాన్ యెన్, అంతర్జాతీయ ద్రవ్య నిధికి సంబంధించినవే ఉన్నాయి. వీటిపై వడ్డీ స 6.30 శాతంగా ఉంటోందని అధికారులు పేర్కొంటున్నారు. రెండు విదేశీ సంస్థలైన ఐబిఆర్‌డి (ఇంటర్నేషన్ బ్యాంక్ ఫర్ రీకన్‌స్ట్రక్షన్ డెవలప్‌మెంట్), ఏడిబి (ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు) నుంచే రాష్ట్రం రుణాలను తీసుకుంటోంది. ఇప్పటి వరకు ఇలా తీసుకున్న రుణాల విలువ దాదాపు ఐదు వేల కోట్ల వరకు ఉంటుందని ఒక అంచనా. రాష్ట్రం గుర్తించిన ఆరు పథకాల్లో ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ ఇరిగేషన్ అగ్రికల్చర్ ట్రాన్స్ఫర్మేషన్ ప్రాజెక్టు, ఎపి హెల్త్ సిస్టమ్ స్ట్రెంతనింగ్ ప్రాజెక్టు, ఆపి లెర్నింగ్ ట్రాన్స్ఫర్మేషన్ ఆపరేషన్ ప్రాజెక్టుతోపాట విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్లు మూడు ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల రుణ మొత్తాన్ని యెన్‌లలోకి మార్చాలని ప్రభుత్వం కోరుతోంది. డాలర్ ద్వారా చెల్లింపులు చేస్తే రాష్ట్రం తీసుకుంటున్న స్థానిక రుణాలు, వేస్ అండ్ మీన్స్ చెల్లింపులు కూడా భారంగా మారుతున్నాయని అధికారులు చెబుతున్నారు.

లంకను కూల్చిన జంపా

- మార్ష్, ఇంగ్లిస్ అర్ధసెంచరీలు
- శ్రీలంకపై ఐదు వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా గెలుపు



లక్నో: ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా బోణీకొట్టింది. తొలిరెండు మ్యాచుల్లో ఓడి పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిచిన ఆస్ట్రేలియా.. సోమవారం శ్రీలంకపై ఐదు వికెట్ల తేడాతో గెలిచి ఊపిరి పీల్చుకుంది. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక జట్టు 43.3ఓవర్లలో 209పరుగులకే కుప్పకూలింది. ఈ మ్యాచ్‌కు రెండుసార్లు వర్షం ఆటంక పరిచింది. శ్రీలంక కెప్టెన్ కుశాల్ మెండీస్ తొలిగా బ్యాటింగ్‌కు మొగ్గుచూపగా.. ఆ నమ్మకాన్ని బ్యాటర్లు వమ్ముచేయలేదు. ఓపెనర్లు నిస్సంక(61), కుశాల్ పెరీరా(78) తొలి వికెట్‌కు 125పరుగులు జతజేశారు. దీంతో శ్రీలంక జట్టు భారీస్కోర్ దిశగా పయనిస్తుందనుకున్న దశలో 84 పరుగుల వ్యత్యాసంలో మిగిలిన 9వికెట్లను కోల్పోయింది. మిడిలార్డర్‌లో చరిత్ అసలంక(25) మాత్రమే కాస్త ఫర్వాలేదనిపించాడు. ధనుంజయ(7), వెల్లెలగె(2), కరుణరత్నే(2), తీక్షణ(0), లాహిరు(4) ఇలా వచ్చి అలా వెళ్లారు. రెగ్యులర్ కెప్టెన్ దసున షనక గాయపడడంతో జట్టు సారథ్య బాధ్యతలు కుశాల్ మెండిస్ అందుకున్నాడు. అతడు 9 పరుగులకే ఔట్ కావడంతో లంక జట్టు భారీస్కోర్‌పై ఆశలు వదులుకుంది. ఈ మ్యాచ్‌కు వర్షం రెండుసార్లు అంతరాయం కలిగించగా.. ఆడమ్ జంపాకు నాలుగు, పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్ రెండేసి వికెట్లు తీసి శ్రీలంక పతనాన్ని శాసించారు. ఛేదనలో ఆస్ట్రేలియా ఓపెనర్ వార్నర్(11), స్మిత్(0) నిరాశపరిచినా.. మార్ష్(52), ఇంగ్లిస్(58) అర్ధసెంచరీలతో మెరిసారు. చివర్లో మ్యాక్స్‌వెల్(31నాటౌట్; 21బంతుల్లో 4ఫోర్లు, 2సిక్సర్లు), స్టొయినీస్(20నాటౌట్; 10బంతుల్లో 2ఫోర్లు, సిక్సర్) మ్యాచ్‌ను ముగించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ జంపాకు లభించింది.

వన్డే ప్రపంచకప్‌లో నేడు..
దక్షిణాఫ్రికా × నెదర్లాండ్స్
(వేదిక: ధర్మశాల, మ.2.00గం॥లకు)

స్కోర్‌బోర్డు(సంక్షిప్తంగా)...
శ్రీలంక : 209ఆలౌట్(43.3ఓవర్లలో)
(నిస్సంక 61, కుశాల్ పెరీరా 78
జంపా 4/36; స్టార్క్ 2/32, కమిన్స్ 2/32)
ఆస్ట్రేలియా: 215/5(35.2 ఓవర్లలో)
మిఛెల్ మార్ష్ 52, ఇంగ్లిస్ 58
(మధుశంక 3/38, వెల్లెలగె 1/53)
ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్
ఆడం జంపా

శ్రీ గాయత్రీదేవి అలంకారంలో 'దుర్గమ్మ'

- టిటిడి తరుపున అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ



టిటిడి తరుపున దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న పాలకమండలి సభ్యులు

ప్రజాశక్తి- యంత్రాంగం

విజయవాడలోని శ్రీ దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ అమ్మవారి దసరా మహోత్సవాల రెండో రోజు అమ్మవారు శ్రీ గాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చింది. సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే దుర్గమ్మను దర్శించుకునేందుకు దేవాలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. గాయత్రీదేవి అలంకృత అమ్మవారికి తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు మేకా శేషుబాబు, గడిరాజు వెంకట సుబ్బరాజు టిటిడి తరుపున పట్టు వస్త్రాలు సమర్పించారు. ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు, నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా, డిసిపి విశాల్ గున్ని, దేవాలయ ఇఒ కెఎస్.రామారావు, చైర్మన్ కర్నాటి రాంబాబు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి సందర్శకులు వస్తుండడంతో ప్రభుత్వ యంత్రాంగంతోపాటు రెడ్ క్రాస్ వలంటీర్లు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పలు కళాశాలల విద్యార్థులు సేవా యజ్ఞంలో పాలుపంచుకుంటున్నాయి. నడవలేని వారిని వీల్ చైర్ ద్వారా తీసుకెళ్లడం దర్శనం చేయిస్తున్నారు. కొన్ని సంస్థలు పసిపిల్లలకు పాలు, క్యూలైన్లోని వారికి తాగునీరు అందిస్తున్నాయి. రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి రాధిక అశోక్ మాట్లాడుతూ మూడు షిఫ్ట్‌ల్లో 60 మంది యువ కార్యకర్తలు సేవలందిస్తున్నారని తెలిపారు.

చిన్నశేష, హంస వాహనాలపై శ్రీనివాసుడు

తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం శ్రీమలయప్ప స్వామివారు శంఖుచక్రాలతో యోగముద్రలో బద్రీనారాయణ అలంకారంలో ఐదు తలల చిన్న శేషవాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ సందర్శకులకు దర్శనమిచ్చారు. ఈ వాహన సేవలో టిటిడి చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఇఒ ఎవి.ధర్మారెడ్డి, తిరుమల పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

గడువు పొడిగించాలి : ఎన్‌ఎంయు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్‌ఆర్‌టిసి ఉద్యోగులు ఇపిఎఫ్ 95 ద్వారా హయ్యర్ పెన్షన్ పొందేందుకు పిఎఫ్‌శాఖ ఇచ్చిన నోటీసుల్లో పేర్కొన్న మొత్తం డబ్బులను చెల్లించేందుకు విధించిన గడువును మరో మూడు నెలలు పొడగించాలని ఎపిపిటిడి నేషనల్ మజ్దూర్ యూనిటి అసోసియేషన్ (ఎన్‌ఎంయు) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎన్‌ఎంయు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పివి రమణారెడ్డి, వై శ్రీనివాస రావు, రాష్ట్ర నాయకులు అనిల్‌కుమార్ సోమవారం ఎపిఎస్‌ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమల రావుకు, పిఎఫ్ రీజినల్ కమిషనరు జి హేమలతకు వినతిపత్రాలు అందజేశారు. ఆర్‌టిసి ఉద్యోగులు ఎక్కువ మంది హయ్యర్ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఆర్‌టిసి ఉద్యోగులకు ఇటీవల కాలంలో ఎరియర్స్, అలవెన్సులు, ఇతర బిల్లుల చెల్లింపులు జరగకపోవడంతో ఉద్యోగులు విధిలేని పరిస్థితితో పిఎఫ్ డబ్బును వాడుకోవడంతో వారి పిఎఫ్ ఖాతాల్లో డబ్బులేని పరిస్థితి నెలకొందని వివరించారు. డబ్బు చెల్లించాలని పిఎఫ్‌శాఖ నోటీసులిచ్చినా చెల్లించలేక అనర్హులుగా మిగిలిపోతున్నారని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అందరూ పెన్షన్ పొందేలా ఈ స్కీమ్‌కు డబ్బు కట్టేందుకు మరో మూడు నెలల గడువు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి కుటుంబాల సభ్యులు పెళ్లి పనులు కూడా శరవేగంగా పూర్తి చేస్తున్నట్లు సమాచారం. మొన్నీమధ్య వరుణ్ ఫ్యామిలీ అంతా కలిసి ప్రీ వెడ్డింగ్ పార్టీని జరుపుకున్నారు. తాజాగా బ్యాచిలర్ పార్టీ జరిగినట్లు తెలుస్తోంది. ఈ పార్టీకి వరుణ్ కుటుంబంతో పాటు టాలీవుడ్ నుంచి కేవలం నితిన్, హీరోయిన్ల నుంచి రీతూ వర్మ మాత్రమే హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి కాబోయే జంటతో కేక్ కటింగ్ చేయించి ఆశీర్వదించారు.



క్రికెట్ సహా ఐదు క్రీడలకు ఓకే..

ఓటింగ్‌లోనూ ఐఓసి సభ్యుల ఆమోదం

ముంబయి: 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌నుంచి క్రికెట్ సహా ఐదు క్రీడలకు అవకాశం దక్కింది. సోమవారం ముంబయిలో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐఓసీ) సదస్సులో ఓటింగ్ నిర్వహించగా... ఇద్దరు సభ్యులు మాత్రమే వ్యతిరేకంగా ఓటు వేశారు. దీంతో ఐదు క్రీడలను చేర్చాలనే ప్రతిపాదనకు ఆమోదం లభించిందని ఐఓసీ అధ్యక్షుడు థామస్ బాచ్ వెల్లడించారు. క్రికెట్(టి20)తో పాటు బేస్‌బాల్- సాఫ్ట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, లక్రాస్ (సిక్సస్), స్క్వాష్‌లకు 2028 ఒలింపిక్స్‌లో చోటు దక్కినట్లు ప్రకటించారు. ఐఓసి నిబంధనల ప్రకారం ఆతిథ్య నగరం ఈ క్రీడల ప్రవేశానికి ఆమోదం తెలిపితే సరిపోతుంది. ఆ క్రీడల్లో టి20 ఫార్మాట్‌లో పురుషుల, మహిళల క్రికెట్ పోటీలు జరగనున్నాయి. ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు చోటు దక్కడం పట్ల ఐసిసి చైర్మన్ గ్రెగ్ బర్క్లే హర్షం వ్యక్తం చేశారు. ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు మరోదఫా అవకాశం లభించడానికి, మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఐఓసి సభ్యురాలు నీతా అంబానీ మాట్లాడుతూ.. 2028 ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను చేర్చడాన్ని స్వాగతిస్తున్నట్లు, క్రికెట్ ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ప్రజలు ఇష్టపడే క్రీడల్లో ఒకటని, అత్యధికమంది వీక్షిస్తారన్నారు. అలాగే కొత్త తరానికి నూతన ఉత్సాహాన్నిస్తుందని ఆమె వెల్లడించారు.

డెన్మార్క్, ఫ్రెంచ్ ఓపెన్‌లకు ప్రణయ్ దూరం

హైదరాబాద్: భారత స్టార్ షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్ రాయ్ డెన్మార్క్, ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. ఆసియా క్రీడల్లో గాయపడ్డ ప్రణయ్.. గాయం నుంచి ఇంకా కోలుకోకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నాడు. ఆసియా క్రీడలు ముగిసిన తర్వాత భారత్‌కు చేరిన ప్రణయ్‌కు ఎంఆర్ఐ స్కాన్‌లో తీవ్రంగా గాయపడినట్లు తేలింది. దీంతో అతనికి మరో 2-3వారాలు విశ్రాంతి అవసరమని డాక్టర్లు నిర్ధారించారు. ఇక ఆసియా క్రీడల సింగిల్స్ విభాగంలో కాంస్య పతకం నెగ్గిన ప్రణయ్.. పతకం నెగ్గే క్రమంలో వెన్నునొప్పికి గురయ్యాడు. దీంతో డెన్మార్ ఓపెన్ సూపర్-750, ఫ్రెంచ్ ఓపెన్ సిరీస్‌ల నుంచి వైదొలిగాడు.

పాయింట్ల పట్టిక

వ.స.	దేశం	ఆ	గె	ఓ	పా	నె.ర.
1.	భారత్	3	3	0	6	+1.82
2.	న్యూజిలాండ్	3	3	0	6	+1.60
3.	దక్షిణాఫ్రికా	2	2	0	4	+2.36
4.	పాకిస్తాన్	3	2	1	4	-0.13
5.	ఇంగ్లండ్	3	1	3	2	-0.08
6.	ఆఫ్ఘనిస్తాన్	3	1	2	2	-0.65
7.	బంగ్లాదేశ్	3	1	2	2	-0.69
8.	ఆస్ట్రేలియా	3	1	2	2	-0.73
9.	శ్రీలంక	3	0	3	0	-1.53
10.	నెదర్లాండ్స్	2	0	2	0	-1.80

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర:నెట్‌రన్‌రేట్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68